ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

ఆదివారం 7 జూలై 2024 | 5



గోదారికి వరద



ధవళేశ్వరం, జూలై 6 : గోదావరి రంగుమారుతోంది.. నేనొస్తున్నానంటూ హెచ్చరిక జారీ చేసింది.. ఎందుకంటే గోదావరికి వరద నీరు నీరొస్తుంది. వర్షాకాలం సీజన్ ప్రారంభమైన తరువాత ఎగువ నుంచి వచ్చే వరద నీటి కారణంగా గోదావరి రంగు మారుతోంది.. ఆ నీరు క్రమక్రమంగా పెరిగి వరదలా మారుతుంది.. వర్షాకాలం ముగిసిన వెంటనే గోదావరి మళ్లీ రంగుమారుతోంది.. నీరు సాధారణ స్థితిలోకి వచ్చేస్తుంది. ఈ ఏడాది ఇప్పుడిప్పుడే మొదటిసారిగా గోదావరికి ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు వచ్చి చేరుతుం డడంతో ఎరుపు రంగు సంతరించుకుని ప్రవహిస్తూ కనువిందు చేస్తుంది.శనివారం కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టా ప్రధాన పంట కాలువకు 3 వేల క్యూసెక్కులు,మధ్య డెల్టా ప్రధాన పంట కాలువకు 2420 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా ప్రధాన పంట కాలువకు రూ.4 వేల క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.గోదావరికి వరద వచ్చే అవకాశం ఉండడంతో 40,866 క్యూసెక్కులు మిగులు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం ఆర్మ్‌లోని 35 గేట్లు, ర్యాలీ ఆర్మ్ లోని 10 గేట్లు, మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లోని 5 గేట్లు 20 మిల్లీమీటర్ల మేర పైకి ఎత్తారు. ధవళేశ్వరం గోదావరి నీటి 10.90 అడుగులుగా నమోదైంది.

సముద్రంలోకి 40,866 క్యూసెక్కులు విడుదల



టీడీపీ నాయకులపై వైసీపీ నాయకుడి దాడి

ఇద్దరిపై పెప్పర్ స్ప్రే, యాసిడ్‌తో దాడి - అనంతపల్లిలో వైసీపీ జగడం

నల్లజర్ల, జూలై 6 : వైసీపీకి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పినా.. ఆ పార్టీ నాయకుల ఆగడాలు మాత్రం తగ్గడం లేదు. ప్రతి రోజూ ఏదో ఒక చోట షరా మామూలుగా గొడవలకు దిగుతూనే ఉన్నారు. తాజాగా తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లిలో వైసీపీ కార్యకర్త.. టీపీడీ నాయకులపై పెప్పర్ స్ప్రే, యాసిడ్‌తో దాడి చేశాడు. వివరాలిలా ఉన్నాయి.. అనంతపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గురుమిల్లి వెంకట సూర్యనారాయణ, చింతా గణేశ్ శుక్రవారం రోడ్డుపై నిలబడి మాట్లాడుకుంటున్నారు.ఆ సమయంలో అటుగా వచ్చిన వైసీపీ కార్యకర్త యెర్నేని సన్యాసిరావు టీడీపీ నాయకుడు సూర్యనారాయణను దుర్భాషలాడి వెళ్లిపోయాడు.దీంతో టీడీపీ నాయకుడు శనివారం రాత్రి గ్రామ పెద్దల్లో తగువు పెట్టాడు. అక్కడికి వచ్చిన సన్యాసిరావు తగువు ప్రారంభించిన వెంటనే సూర్యనారాయణ, గణేశ్ ముఖాలపై పెప్పర్ స్ప్రే కొట్టి యాసిడ్ పోసి పారిపోయాడు. దీంతో వారిని స్థానికులు 108 వాహనంలో నల్లజర్ల పీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతున్నారు. టీడీపీ నాయకుల కంటి చూపు మందగించిందని మెరుగైన చికిత్స అందించాల్సి ఉం దని వైద్యులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైసీపీ ఆగడాలు నిర్మూలించి దాడి చేసిన సన్యాసిరావును, ప్రోత్సహించిన వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, టీడీపీ నాయకుడు గురుమిల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.



రాజమహేంద్రవరంలో ఎంపీ కార్యాలయ నిర్మాణానికి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతుల భూమిపూజ

రేపు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 6 : రాజమహేంద్రవరంలో సోమవారం నిర్వహించనున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవంతం చేయాలని బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సూచించారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె నిర్వహణ కమిటీల ఇన్‌ఛార్జిలతో మాట్లాడారు. సమావేశం విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు. అనంతరం జేఎన్ రోడ్డులోని కోస్టల్ గార్డెన్స్‌లో తన నివాసానికి ఆనుకుని నిర్మిస్తున్న క్యాంపు కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. ఈ మేరకు ఎంపీ పురందేశ్వరి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు దంపతులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. లోక్‌సభలో ప్రమాణస్వీకారం చేసిన తరువాత తొలిసారిగా వచ్చిన ఆమెను కొత్త కలెక్టర్ ప్రశాంతి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సీతానగరం కార్యదర్శి సతీష్ సస్పెన్షన్

సీతానగరం,జూలై 6 : సీతానగరం పంచాయతీ కార్యదర్శి సిహెచ్.నాగ సతీష్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. పర్యవేక్షణలో విఫలమైనందున ఈవోపీఆర్‌డీ కేవీవీఎస్ఎస్.మూర్తికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. సీతానగరం పంచాయతీ పరిధిలో కలెక్టర్ పశాంతి పర్యటించిన సమయంలో గ్రామంలో పారిశుధ్యం నిర్వహణ, తాగునీటి సరసరాపై నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు తేలింది.కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్టు డీపీవో రాంబాబు తెలిపారు. ప్రస్తుతం వంగలపూడి పంచాయతీ కార్యదర్శి సుజాతకు బాధ్యతలు అప్పగించారు.

వేధింపులు నివారణకు 78 కమిటీలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 6 : పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించే దిశగా జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం 2013పై ఫిర్యాదుల కమిటీ, నోడల్ అధికారులతో నిర్వహించిన శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేసే ప్రతి కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా స్థాయి కమిటీలో కలెక్టర్, ఛైర్ పర్సన్‌గా డీఎం, సివిల్ సప్లయిస్ టి.రాధిక, ఎక్స్ అఫీషియోసభ్యులుగా ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, సభ్యులుగా గిరిజన సంక్షేమ అధికారి కేఎస్.జ్యోతి, డీఎల్‌డీవో పి.వీణాదేవి, ఏకలవ్య చిల్డ్రన్ హోమ్ ప్రతినిధి పి .శేషారత్నంను నియమించినట్లు తెలిపారు. జిల్లాలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధించే 78 కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులతో శానిటేషన్ నిర్వహణపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక శానిటేషన్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తాగునీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు.

రాజమండ్రిలో ఫస్ట్ ప్లాట్‌ఫాంపై రైళ్ల నిలిపివేత 7

ఇసుక ఆనందం



రేపటి నుంచి ఇసుక ఉచితం

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

ఇసుక కష్టాలు ఇంతింతకాదయా...ఇదీ ఐదేళ్లగా ప్రజల నోట వినిపించే మాట..ఎందుకంటే గోదావరి చెం తనే ఉన్నా యూనిట్ ఇసుక కావాలన్నా ఇబ్బందులే.. వేలకు వేలు పోస్తేనే ఇసుక ఇంటికి చేరేది.. ఒకనాడు అయితే ఎమ్మెల్యేలు.. ఎంపీల సిఫారసులు ఉంటేనే ఇసుక అందేది.. పేద మధ్య తరగతి ప్రజలకు ఇసుక అందడమే గగనమైపోయింది.. జగనన్న ఇళ్ల కాలనీ వాసులు ఇసుక కోసం ఎంతలా అల్లాడారో వాళ్లకే తెలుసు.. ఇసుక కొనలేక చాలా మంది ఇళ్లు కట్టలేకపోయారు.. కొంత మంది ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి.. అయినా పాలకుల్లో కనీస కదలిక లేదు.. ఎప్పుడూ మీకెంత.. మాకెంత.. ప్రజల గురించి ఆలోచనే లేదు..అదే ఫ్యాన్ రెక్కలు విరిచింది..కూటమి ప్రభుత్వం వచ్చింది.. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించి దాదాపుగా నెలరోజులవుతుందో లేదో.. అప్పుడే ప్రజల గురించి ఆలోచించడం ఆరంభించారు..ఇసుక ఉచితం అంటూ పేదింటికి తీపి కబురు చెప్పారు.. చెప్పడమే కాదు.. రేపటి నుంచే అమల్లోకి తెస్తున్నారు.దీంతో ప్రజల కష్టాలు తీరనున్నాయి. భవన నిర్మాణ రంగం పుంజుకోనుంది.

స్టాక్ పాయింట్ల నుంచే సరఫరా

సోమవారం నుంచి స్టాక్ పాయింట్లలో ఇసుకను మాత్రమే ఇస్తారు. స్టాక్ పాయింట్లలో అంటే గోదా వరి నుంచి ఇసుక తీసి లారీల ద్వారా తీసుకొచ్చి ఒక స్టాక్ పాయింట్‌లో వేస్తారు. దీనికి అయిన ఖర్చును మాత్రం వసూలు చేస్తారు. ప్రస్తుతం ఆఫ్‌లైన్‌లోనే ఇసుకను సరఫరా చేస్తారు. అక్కడే డబ్బు తీసుకుని మాన్యువల్‌గా బిల్లు ఇస్తారు. ప్రతి రోజు సాయంత్రం ఖర్చులు, సీనరేజ్,ఇతర చార్జీలను జిల్లా కలెక్టర్, మైన్స్ ఏడీ పేర ఉన్న జాయింట్ అకౌంట్‌లో జమ చేస్తారు. ప్రస్తుతం స్టాక్ పాయింట్ వద్ద నుంచి సరఫరా చేసే ఇసుకకు వసూలు చేసే చార్జీల వివరాలు ఇలా ఉన్నాయి. గోదావరి నుంచి టన్ను ఇసుక తెచ్చి, లోడ్ చేసినందుకు రూ.30, రీలోడింగ్‌కు రూ.30, సీనరేజి రూ.66, జీఎస్‌టి 18 శాతం, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) రూ.19.68, మెరిట్(ఖనిజాన్వేషణ్ నిధి) 2 శాతం. ఈ మొత్తానికి మరో 5 శాతం జీఎస్‌టీ వసూలు చేస్తారు.ర్యాంపు నుంచి స్టాక్ పాయింట్‌కు కిలోమీటర్‌కు రూ.5 వంతున వసూలు చేస్తారు.ఇలా అన్నీ కలుపుకుని సుమారు రూ.200 వరకూ కావచ్చు. గతంలో స్టాక్ పాయింట్ల వద్ద టన్ను ఇసుకను రూ.750 నుంచి 950కు పైగా అమ్మేవారు. ఇవాళ ఉచిత విధానం వల్ల స్టాక్ పాయింట్ వద్ద చార్జీతో పాటు రవాణా చార్జీలు పెట్టుకుని ఇంటికి ఇసుక చేరుతుంది. వర్షాకాలం, గోదావరికి వరదలు వచ్చే సమయం కాబట్టి ఓపెన్ ర్యాంపుల జోలికి వెళ్లడంలేదు. డీసిల్టేషన్ కోసం ఏజెన్సీలను, బోట్స్‌మన్ సొసైటీలను బహుశా టెండర్ల ద్వారా ఎంపిక చేయనున్నట్టు సమాచారం. పూర్తి నిర్ణయాలు ఒకటి రెండ్రోజుల్లో ప్రభుత్వం తీసుకుంటుంది. ఓపెన్ రీచ్‌లు వచ్చిన తర్వాత ర్యాంపుల్లోనే ఇసుక సరఫరా చేసే సమయంలో తగ్గుతుంది.

ఒక్కొక్కరికీ 20 టన్నులు..

ఉచిత ఇసుక విధానం అమల్లోకి రావడంతో అన్నివర్గాల ప్రజలు ఆనం దం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ దోపిడీ విధానం వల్ల నిర్మాణాలు ఆపేసుకున్న సంగతి తెలిసిందే. నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. ఉచిత ఇసుక వల్ల ఆయా రంగాలన్నీ పుంజుకోనున్నాయి. పేదల నుంచి ధనవంతుల వరకూ ఎవరైనా ఒక వ్యక్తి 20 టన్నుల ఇసుక పొందవచ్చు.సీఎం నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా ఉచిత

- స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక సరఫరా
- లోడింగ్ చార్జీలు రూ.200
- దూరాన్ని బట్టి మారనున్న ధర
- జిల్లాలో 7 స్టాక్ పాయింట్లు
- ప్రస్తుతానికి ఆఫ్‌లైన్‌లో అందజేత
- అక్టోబర్ తర్వాత ఆన్‌లైన్‌లో
- నేడు ర్యాంపుల్లో ఇసుక లెక్క
- నెరవేర్చిన కూటమి రెండో హామీ
- పేదింట సంతోషం

ఇసుక విధానం అమల్లోకి తెచ్చారు.. వైసీపీ ప్రభుత్వం టన్నుకు రూ.475 నుంచి రూ.625 వసూలు చేయడంతో పాటు, ప్రభుత్వానికి సీనరేజి కట్టలేదు. జీఎస్‌టీ కట్టలేదు. డీఎంఎఫ్ లేదు. మెరిట్ చెల్లించలేదు. రూ.కోట్ల ఇసుక అమ్మకాలు జరిగినా ప్రభుత్వ ఖజానాకు పైసా చేరలేదు. అంతా దోపిడీ అయింది. 20 టన్నుల లారీ ఇసుక రూ.30 వేలకు వరకూ అమ్మిన సంగతి అనుభవమే.

ఏడు స్టాక్ పాయింట్లలో ఇసుక

జిల్లాలోని కాతేరు,లాలాచెరువు,బుర్రిలంక, కుమారదేవం, చిడిపి, పందలపర్రు, పెండ్యాల, ఉసులు మర్రులోని ఏడు స్టాక్ పాయింట్లలో 3 లక్షల టన్నుల ఇసుక ఉంది. దానినే ముందుగా విక్రయిస్తారు. గాయత్రీ, కాతేరు,వెంకటనగర్,కొవ్వూరు తదితర ర్యాంపుల్లో ఇసుక గుట్టలు ఉన్నాయి. అందులో ఎన్ని టన్నుల ఇసుక ఉందనేది ఆదివారం తేల్చనున్నారు. జిల్లాలో 17 ఓపెన్ ర్యాంపులు ఉన్నాయి. సుమారు 32 వరకూ డీసిల్టేషన్ ర్యాంపులు ఉన్నాయి. అవన్నీ ప్రస్తుతం ఆగాయి.ర్యాంపుల్లో మొత్తం 97 బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి.

ఇసుక సొమ్ము ప్రభుత్వానికి రూపాయి వెళ్లదు..

కలెక్టర్ ప్రశాంతి



జిల్లా ఉచిత ఇసుక పంపిణీ పాలసీ మార్గదర్శకాలు జవాబుదారీతనంతో ఖచ్చి తంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఇసుక కమిటీ సమావేశం జరి గింది. ఉచిత ఇసుక విధానంలో కేవలం వినియోగదారుల నుంచి ఇసుక తవ్వకం, రవాణా, పరిపాలనాప ర మైన ఖర్చులు మాత్రమే వసూలు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చార్జీలు వసూలు చేయదని చెప్పారు. లాభాపేక్ష లేకుండా వినియోగదారులకు ఇసుక సరఫరా చేయడమే లక్ష్యమన్నారు. రెవెన్యూ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్టాక్ పాయింట్ వద్ద డిప్యూటీ తహశీల్దార్,ఆపై అధికారి పర్యవేక్షణ చేస్తారన్నారు. మూడు షిఫ్టులలో విధులు నిర్వహిస్తారన్నా రు. ఉచిత ఇసుక విధానంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ ప్రధాన పాత్ర పోషించాలన్నారు. 20 టన్నుల ఇసుక వరకూ వ్యక్తిగత ఆధారాలు, వివరాలు తీసుకుని డీఎల్ఎస్సి ద్వారా సమీక్షించి ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో సాగేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా, డివిజన్ స్థాయిలో ఎన్‌ఫోర్స్ మెంట్ టీమ్‌ల ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా స్టాక్ పాయింట్లు, డీసిల్టేషన్ పాయింట్ల వద్ద మండల రెవెన్యూ,స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో కూడా టీమ్ నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇసుక రవాణా సక్రమంగా జరిగేలా చూడడం కోసం పోలీసు, రెవెన్యూ, సెబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొత్తగా డీసిల్టేషన్ చేయడానికి ఏజెన్సీలు, బోట్స్‌మెన్ సొసైటీలను టెండర్ ప్రకటన ద్వారా ఎంపిక చేయాలని తెలిపారు. డీసిల్టేషన్ కార్య కలాపాలు మార్గదర్శకాల ప్రకారం, పర్యావరణ, నిర్వహణతో సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాలన్నారు.జల వనరుల శాఖ నదులు, కాలువలు, రిజర్వాయర్లు నుంచి అవసరమైన అన్ని అనుమతులు ఇరిగేషన్ నుంచి పొందాలన్నారు. సమావేశంలో డీఆర్వో జి.నరసింహులు, సబ్- కలెక్టర్ శ్రీ అశుతోష్ శ్రీవాత్సవ, ఆర్‌డీవో ఎ.చైత్రవర్షిణి, మైన్స్ ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం, సెబ్ ఏఎస్పీ పి.సోమ శేఖర్, ఏఎస్పీ ఎం.రాజశేఖర్, ఇరిగేషన్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరావు, డీఆర్‌డీఏ పీడీ ఎస్‌వీవీఎస్.మూర్తి,ఆర్‌డ బ్ల్యూఎస్ ఎస్ఈ డి.బాలశంకరరావు, డీపీవో డి.రాంబాబు, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి వై.శ్రీనివాస్, ఏటీవో సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంల చర్చల్లో మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విభ జన అంశాల పరిష్కారానికి సీఎం నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో చర్చలు జరిపారు. ఈ చర్చలకు రాష్ట్రం నుంచి ముగ్గురు మంత్రులకు ఆహ్వానం ఉండడం తెలిసిందే. నిడదవోలు ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటక శాఖ కందుల దుర్గేష్ కూడా పాల్గొనడం గమనార్హం. చర్చలు సజావుగా సాగినట్టు ఆయన తెలిపారు.

ఆశలన్నీ పండుగలపైనే



- దిగజారిన కొబ్బరి ధరలు
- వరుస పర్వదినాలపైనే రైతుల ఆశలు
- క్షీణించిన ఎగుమతులు
- ఇతర రాష్ట్రాల్లో ఆశాజనకంగా దిగుబడులు
- ఊపందుకోని నీటికాయ అమ్మకాలు

అంబాజీపేట, జూలై 6: రాష్ట్రంలో కొబ్బరి నాణ్యమైన దిగుబడులు లేక, ఇతర రాష్ట్రాల్లో దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో కోనసీమ కొబ్బరి మార్కెట్‌లో ధరలు దిగజారాయి. ఈ ఏడాది జనవరి నుంచి ధరల పెరుగుదలలో పెద్దగా వ్యత్యాసం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం ఎకరా దింపు తీసిన ఖర్చులు కూడా రావడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఆర్డర్లు రాకపోవడంతో రోజుకు 20 లారీల సరుకు మాత్రమే ఎగుమతులు అవుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఆశాజనకంగా ఉండడంతో ఆయా రాష్ట్రాల నుంచి వివిధ రాష్ట్రాలకు కొబ్బరి అధికంగా ఎగుమతులు జరుగుతున్నాయి. అయితే త్వరలో వచ్చే నాగపంచమి, శ్రావణమాసం, రాఖీపౌర్ణమి, వినాయక చవితి పండుగలతో కొబ్బరి ధరలు పెరుగుతాయని రైతులు, వ్యాపారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో మహిళలు రాఖీకడితే కానుకగా కొబ్బరికాయలను అందిస్తారని, దీంతో ఆయా ప్రాంతాలకు భారీగా కొబ్బరికాయల ఎగుమతి అయ్యే అవకాశాలు ఉండవచ్చని కొబ్బరి అప్పన కాశీప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం మధ్యప్రదేశ్, ఒడిసా రాష్ట్రాలకు మాత్రమే కొబ్బరి ఎగుమతులు అవుతున్నాయన్నారు. మరోవైపు వర్షాకాలం ప్రారంభం ఆలస్యంకావడం ఈ కొబ్బరి ఎగుమతులకు ఆటంకం కలుగుతోందన్నారు. వర్షాకాలం ప్రారంభం అయితే ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ పనులను ప్రారంభించే ముందే కొబ్బరికాయలు కొడతారని, దీంతో ఆయా ప్రాంతాలకు ఎగుమతులు అధికంగా అవుతాయని ఆయన తెలిపారు. వ్యవసాయ పనులను ప్రారంభిస్తే బీహార్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, గుజరాత్ తదితర రాష్ట్రాలకు ఎగుమతులు జోరుగా సాగుతాయి. అలాగే పండుగలైన నాగపంచమి, శ్రావణమాసం, రాఖీపౌర్ణమి, వినాయకచవితికి కొబ్బరి ఎగుమతులు మరింతగా జోరుందుకుంటాయని ఆయన చెప్పారు.

నీటికాయ ధరల మాటేమిటి..

కోనసీమ ప్రాంతంలో రైతులు అధికంగా కొబ్బరిపైనే ఆధారపడి జీవిస్తారన్నది తెలిసిందే. గతంలో రైతులు ఎప్పుడు దింపు తీసినా పచ్చికొబ్బరికాయలను లేదా నెలరోజులపాటు నిల్వ ఉంచిన ముక్కుడు కొబ్బరికాయలను విక్రయిస్తూ జీవనం సాగించేవారు. అయితే ప్రస్తుతం కొబ్బరి దిగుబడులు తగ్గినప్పటికీ ధరలు ఏ మాత్రం పెరగలేదు. నీటికాయ ధరలు క్వింటాలుకు రూ.9 వేలు మాత్రమే ధరలు అందుతున్నాయి. గత మూడేళ్ల నుంచి ఇవే ధరలు కొనసాగుతున్నాయి. ఇతర అన్ని సరుకుల ధరలు పెరుగుతున్నా కొబ్బరి ధరల్లో మాత్రమే మార్పు ఉండడంలేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కొబ్బరి మార్కెట్ ధరలు ఇలా...

కొబ్బరి రకం	ధర(రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	9,500
కురిడీ కొబ్బరి(పాతవి) :	
గండేరా(వెయ్యి)	13,500
గటగట(వెయ్యి)	11,000
కురిడీ కొబ్బరి (కొత్తవి) :	
గండేరా(వెయ్యి)	10,00
గటగట(వెయ్యి)	9,000
నీటికాయ :	
పాత(ముక్కుడు)(వెయ్యి)	9,000- 9,500
కొత్త(పచ్చి) (వెయ్యి)	8,000-8,500

రేపు అంబాజీపేటలో నాఫెడ్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

అంబాజీపేట, జూలై 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే నాఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని ఆయిల్‌ఫెడ్ ఎండీ చావెల బాబురావు ఆదేశాల మేరకు ఈనెల 8వ తేదీన అంబాజీపేటలో ప్రారంభిస్తున్నట్టు ఏపీ ఆయిల్‌ఫెడ్ సీనియర్ మేనేజర్ యు.సుధాకరరావు తెలిపారు. అంబాజీపేటలో సోమవారం రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా ఈ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. మిల్లింగ్‌కోప్రాకు క్వింటాల్‌కు రూ.11,160, బాల్‌కోప్రాకు రూ.12 వేలు మద్దతు ధర నిర్ణయించిందన్నారు. ఆర్బీకేలలో నమోదు చేసుకున్న రైతుల వద్ద నుంచి నోడల్ ఏజెన్సీ కృషీవల కోకోనట్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఛైర్మన్ గణపతి వీరరాఘవులు, సీఈవో అడ్డాల గోపాలకృష్ణ, ముత్యాల జమీలు ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తామన్నారు. కొబ్బరి తేమ శాతం, దుమ్ము, దూళి తదితర అంశాలను రైతులు పాటించాలన్నారు. మూడు నెలలపాటు కొబ్బరి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు కొబ్బరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



వర్శిటీ ప్రాంగణంలో వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

నన్నయ వర్శిటీలో అవినీతి

- ఐదేళ్లుగా రూ. 40 కోట్ల మేర నిధులు మింగేశారు
- రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

దివాన్‌చెరువు, జూలై 6 : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో 2019 -2024 మధ్య కాలంలో రూ.30-40 కోట్లు మేర అవినీతి జరిగిందని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆరోపించారు. నన్నయ ప్రాంగణంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. వర్శిటీలో అవినీతి అక్రమాలపై సీబీసీఐడీతో విచారణ జరిపిస్తామన్నారు. టెండర్ల నిబంధనలు తుంగలో తొక్కి వారి బంధువులు, బినామీలు, స్నేహితులు, అనుచరులకు టెండర్లు వచ్చేలా చేశారన్నారు. చెల్లింపులు వ్యవహారంలో కూడా ప్రభుత్వం వద్ద నిధులు లేవంటే వర్శిటీ నిధులను ఆయా శాఖలకు బదిలీచేసి చెల్లింపులు చేశారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక ఆనాడు అధికారంలో ఉన్న వారి బంధువులు, అనుచరులు 40 మందికి వర్శిటీలో ఉద్యోగ నియామకాలు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే తన సొంతమామను వీసీ మెంబరుగా ఆర్థిక కమిటీలో సభ్యుడిగా నియమించుకుని వర్శిటీ నిధులను అనేక రకాలుగా దోపిడీ చేశారన్నారు. విద్యాప్రమాణాలు పరిగణనలోకి తీసుకోకుండా దొంగ సర్టిఫికెట్లతో ఉద్యోగ నియామకాలు చేపట్టారని ఆరోపించారు.దీనిపై ప్రాథ మికంగా ఇప్పటికే కొంత నివేదిక తయారు చేశామని ఇంకా వివరాలు సేకరిస్తున్నామన్నారు. వర్శిటీలో అవినీతిపై పూర్తిస్థాయి సమాచారం కోరేందుకు వచ్చినా రిజిస్ట్రార్ అందుబాటులో లేరన్నారు. దీంతో పూర్తిస్థాయి సమాచారం అందించాలని ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ పి.సురేష్ వర్మకు పత్రాలు అందజేశామన్నారు. వీసీ పదవికి రాజీనామా చేసిన పద్మరాజు రాజీనామా తర్వాత కూడా ఫైళ్ల మీద సంతకాలు చేస్తున్నట్టు తెలిసిందన్నారు. నన్నయ అక్రమాలపై సీఎం, ఉపముఖ్యమంత్రి, మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళతానన్నారు.

వాడపల్లి ఆలయం కిటకిట



ఆత్రేయపురం, జూలై 6: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్న భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అన ంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.36.62 లక్షలు లభించినట్టు డిప్యూటీ కమిషనర్ ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.



వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు

శనేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట, జూలై 6:మందపల్లి శనేశ్వర (మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనములకు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,17,291 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

విత్తనాలు, ఎరువుల షాపుల్లో తనిఖీలు

గొల్లప్రోలు, జూలై 6: కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల షాపుల్లో వ్యవసాయశాఖ రాష్ట్ర అధికారుల బృందాలు, విజిలెన్స్ అధికారులు శనివారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. శ్రీకృష్ణా ఏజెన్సీస్, ప్రవంతి ఆగ్రో ఏజెన్సీస్‌ల్లో రికార్డులు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నిల్వలు పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు జరపాలని సూచించారు. తనిఖీల్లో శ్రీకాకుళం వ్యవసాయశాఖ డీడీ కె.త్రినాథస్వామి, విజిలెన్స్ అధికారి డీవీవీ సతీష్‌కుమార్, పిఠాపురం వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, ఏవో కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రసాద విక్రయ కేంద్రం



ప్రసాదాలు విక్రయిస్తున్న సిబ్బంది

అన్నవరం, జూలై 6: జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం వైపు వెళ్లే వాహనదారుల కోసం ఏర్పాటు చేసిన సత్యదేవుడి నమూనాలయం వద్ద ప్రసాదం విక్రయాలను శనివారం నుంచి ప్రారంభించారు. ఈఈ నరసింహారావు, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం కౌంటర్ ప్రారంభించారు. ఎటువంటి సూచీ బోర్డులు లేకపోవడంతో మొదటిరోజు విక్రయాలు నామమాత్రంగానే జరిగాయి. భక్తులకు, వాహనదారులకు తెలిసే విధంగా సూచీ బోర్డులు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంది.

లోవకొత్తూరు శివారులో క్షుద్రపూజలు?

- గేదెదూడను బలివ్వడంతో భయాందోళన
- ప్రశ్నించిన ఓ వ్యక్తిపై దాడికి ప్రయత్నం
- చుట్టుపక్కల వారు రావడంతో పరారీ

తుని రూరల్, జూలై 6: కాకినాడ జిల్లా తుని మండలం లోవకొత్తూరు శివారులో సంచార వ్యక్తులు కొందరు క్షుద్ర పూజలు చేయడం కలకలం రేపింది. గ్రామ శివారులో అమావాస్య రోజు రాత్రి కొంత మంది వ్యక్తులు పూజలు నిర్వహించి దూడను బలి ఇవ్వడం సంచలనం రేకెత్తించింది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు ఒకరు వెళ్లి ప్రశ్నించగా మద్యం మత్తులో అతనిపై దాడికి ప్రయత్నించారు. దీంతో గ్రామస్థులు అందరూ ఒక్కసారిగా అక్కడకు వెళ్లగా పూజలు నిర్వహించిన వారు పరారయ్యారు. విషయాన్ని రూరల్ పోలీసులకు తెలియపరచగా రూరల్ ఎస్‌ఐ రమేష్‌బాబు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే ఎస్‌ఐ చెప్పిన వివరాలు ప్రకారం సంచార వ్యక్తులు అమావాస్య రోజున ఈ క్రమంలో పూజలు చేయడం ఆనవాయితీ అని తెలిపారని అయితే ఇవి క్షుద్ర పూజలు కాదని తెలిపినట్లు ఎస్‌ఐ తెలిపారు. గ్రామస్తులు ఎటువంటి భయాందోళనకు గురికావద్దన్నారు.



బలైన గేదెదూడ

కొబ్బరి చెట్ల ఫలసాయం వేలం పాటలో ఉద్రిక్తత

కె.గంగవరం, జూలై 6: కోట గ్రామ పంచాయతీ వద్ద శనివారం కొబ్బరి చెట్ల ఫలసాయం కోసం నిర్వహించిన బహిరంగ వేలం పాట ఉద్రిక్తతకు దారితీసింది. కోటిపల్లి - కాకినాడ ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి కోట గ్రామం వరకూ ఉన్న జిల్లా పరిషత్ రహదారి వెంట ఉన్న కొబ్బరి మొక్కల ఫల సాయం తీసుకునే హక్కులకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. 7 బిట్‌లుగా విడదీసి పాటలు పెట్టారు. వీటిలో 1వ బిట్‌లో ఉన్న 325 మొక్కలు ఫలసాయం పాట విషయంలోనే వివాదం జరిగింది. గత కొంత కాలంగా ఈ మొక్కలు గ్రామంలోని జనిపెల్ల కృష్ణమూర్తి, పాము లక్ష్మణరావు కుటుంబాల ఆధీనంలో ఉన్నాయి. తమకు ప్రభుత్వం 30 సంవత్సరాల క్రితం చెట్టు పట్టా పథకంలో ఈ చెట్లు కేటాయించిందని, అప్పటి నుంచి తాము వీటిని సంరక్షించుకుని వీటి నుంచి వచ్చే ఫలసాయంతో జీవనం సాగిస్తున్నామని చెప్పారు. కొంత కాలం తాము వీటి పై ప్రభుత్వానికి పన్ను చెల్లించామని ఇప్పుడు పంచాయతీ వారు తమ దగ్గర నుంచి తీసుకుని వేలం నిర్వహిస్తే ఎలా అని నిలదీసారు. పాట నిలుపుదల చేయాలని గొడవ చేశారు. వేలం నిర్వహిస్తే తాము పురుగుల మందు సేవిస్తామని పురుగుల మందు డబ్బాలతో రెండు కుటుంబాలకు చెందిన మహిళలు హడావిడి చేశారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ సమయంలో జరిగిన గలాటాలో పాటదారులు చెల్లించిన ధరావత్తు సొమ్ము చెల్లాచెదురైంది. పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. పామర్రు ఎస్‌ఐ. కె.జానీబాషా ఆధ్వర్యంలో అదనపు పోలీసు బలగాలను రప్పించి వేలం నిర్వహించారు. మొత్తంగా 7 బిట్‌లకు పాట నిర్వహణ చేయగా నాలుగు బిట్లుకు పాటను ఖరారు చేశారు. రెండు బిట్లకు ఆఫ్‌సెట్ ధర రాకపోవడంతో వాయిదా వేశారు. మరో బిట్‌కు ఎవరు పాటకు ముందుకు రాలేదు. ఐతే వివాదానికి కారణమైన 1వ బిట్‌ను కొండేపూడి వీరబాబు రూ. 6,50,000 హెచ్చు పాటదారునిగా ఖరారు చేశారు. ఈవోపీఆర్‌డీ నాగేంద్ర పర్యవేక్షణలో కార్యదర్శి ఎస్. సుబ్బారావు వేలం పాటలు నిర్వహించారు. దీనిపై గ్రామ కార్యదర్శి వివరణ కోరగా ఈనెల 3వ తేదీన సర్పంచ్ మల్లిడి సుశీల అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించి కొబ్బరి చెట్ల ఫలసాయంపై బహిరంగ వేలం నిర్వహణకు తీర్మానం చేశామన్నారు. అప్పుడు జనిపెల్ల కృష్ణమూర్తి, పాము లక్ష్మణరావు కుటుంబాల వారు ఇవి తమ ఆధీనంలో ఉన్నాయని చెప్పారని దానికి సంబంధించిన డాక్యుమెంట్లు చూపించాలని కోరామని, పాట రోజునైనా తీసుకురావాలని సూచించామని వారు ఏవిధమైన డాక్యుమెంట్లు చూపించలేదన్నారు.



జనాలను చెదరగొడుతున్న పోలీసులు

మాజీ ఉపసర్పంచ్ డీవీఆర్‌పై దాడికి యత్నం

పోలీసుల తీరుపై ఎమ్మెల్యే నల్లమిల్లి ఆగ్రహం

బిక్కవోలు, జూలై 6: కొమరిపాలెం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి మాజీ ఉప సర్పంచ్ ద్వారంపూడి వెంకటరెడ్డిపై కొందరు వ్యక్తులు దాడికి ప్రయత్నించి విఫలమైనట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆరోపించారు. డీవీఆర్‌కు సంబంధం లేని ఓ స్వీట్ స్టాల్ అగ్ని ప్రమాదానికి గురైందని, అందులో 10 గ్యాస్ సిలిండర్లు ఉన్నాయని అవి పేలితే మరింత ప్రమాదం జరుగుతుందని వెంటనే రావాలంటూ కొందరు అర్ధరాత్రి డీవీఆర్ ఇంటికి వెళ్లి చెప్పారన్నారు. ఆ సమయంలో ఆయన ఇంటి నుంచి బయటకు వస్తే దాడి చేయవచ్చునని ప్రత్యర్థుల పన్నాగమని చెప్పారు. అయితే ఆయన కిటికీలోంచే సమాధానం చెప్పి పంపడంతో ఆ ముప్పు తప్పిందన్నారు.



స్వీటు షాపును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

పోలీసులపై ఎమ్మెల్యే ఆగ్రహం..

ఈ విషయాన్ని టీడీపీ నేత మాజీ జడ్పీటీసీ పడాల రాము శనివారం తెల్లవారుజామున 4.30కు బిక్కవోలు ఎస్‌ఐకు తెలియజేసినా వారు ఇప్పటివరకూ సంఘటనా స్థలానికి రాకపోవడంపై ఎమ్మెల్యే పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో టీడీపీ వారు వైసీపీ వారి ఇంటిపై రాయి వేశారని దొంగ ఫిర్యాదు చేస్తే ఎస్పీ నుంచి కింది స్థాయి పోలీసుల వరకూ స్పందించి తమ కార్యకర్తలను వేధించేవారన్నారు. ఈసంఘటనకు పాల్పడిన వారి కంటే దీని వెనుక ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ పడాల రాము, డీవీఆర్, కూటమి నేతలు ఉన్నారు. ఈ సంఘటనపై స్వీట్‌స్టాల్ యజమాని ఖండవిల్లి విజయదుర్గ ఇచ్చిన ఫిర్యాదుపై స్టాల్‌ను స్వల్పంగా తగులబెట్టిన గుర్తు తెలియని వ్యక్తుల మీద, డీవీఆర్ ఇంటికి అర్ధరాత్రి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తుల పైన దర్యాప్తు జరపాలంటూ ఇచ్చిన ఫిర్యాదులపైన రెండు కేసులు నమోదు చేశామని బిక్కవోలు ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపారు.

శృంగార వల్లభస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



పెద్దాపురం, జూలై 6: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,78,140, అన్నదాన విరాళాలు రూ.52,616 ఆదాయం, కేశఖండన ద్వారా రూ. 5,720 తులాభారం రూ.200, లడ్డూ ప్రసాదం ద్వారా 19,620, కానుక ద్వారా 10 వేలు వెరసి రూ. 2,66,296 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు పాల్గొన్నారు.

హుండీల్లో నగదు చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

గొల్లప్రోలు, జూలై 6: కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని నగరపంచాయతీ షాపింగ్ కాంప్లెక్సులో గల వరసిద్ధి వినాయకస్వామి ఆలయ హుండీల్లో చోరీ జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి, శనివారం తెల్లవారుజాము మధ్య సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తలుపులు బద్దలుకొట్టి హుండీలను పగలకొట్టారు. అందులో ఉన్న సుమారు రూ.50 వేల నగదు చోరీ చేశారు. దీనిపై ఆలయ కమిటీ ప్రతినిధులు సిద్ధా వీరబాబు, ముమ్మిడి ఈశ్వరరావు, మాదేపల్లి నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు, క్లూస్ టీమ్ అధికారులు ఆలయం వద్దకు చేరుకుని వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు.

రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ 1వ నంబర్ ప్లాట్‌ఫాంపై మరమ్మతులు

రాజమహేంద్రవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో ట్రాక్ మరమ్మతుల నిమిత్తం ఒకటో ప్లాట్‌ఫాంకి రైళ్ల రాకపోకలను నిలిపివేయనున్నారు. మే నెల 5న గూడ్సు రైలు రెండో ప్లాట్‌ఫాం ట్రాక్‌పై పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. దీంతో ఒకటి, రెండు ట్రాక్‌లకు పూర్తిగా మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. అదే నెల 16న రెండో ట్రాక్ మరమ్మతులను ప్రారంభించి గత నెల 18న పూర్తి చేశారు. ప్లాట్‌ఫాంపై టైల్సు వేసే పనులు ఆలస్యం కావడంతో మరి కొద్ది రోజులు సమయం పట్టింది. ప్రస్తుతం ఆ ట్రాక్‌పై ప్రయాణికుల, గూడ్సు రైళ్లు యథావిధిగా నడుస్తున్నాయి. దీంతో ఒకటో ప్లాట్‌ఫాం ట్రాక్ పట్టాలను పూర్తిగా మార్చే పనిని చేయనున్నారు. దీని కోసం సోమవారం(9వ తేదీ) నుంచి సుమారు నెల రోజులపాటు ఈ ప్లాట్‌ఫాంకి రైళ్ల రాకపోకలు నిలిపివేసే అవకాశం ఉంది. అధికశాతం రైళ్లను రెండు, మూడు ప్లాట్‌ఫాంలపై నిలపనున్నారు. అవసరాన్ని బట్టి మూడు, నాలుగు ప్లాట్‌ఫాంలు కూడా వినియోగించనున్నారు. ఈ రెండు ప్లాట్‌ఫాంలపై ఇంకా షెడ్లు, బోగీల సంఖ్యలు తెలిపే సైన్ బోర్డులు లేకపోవడం గమనార్హం. వర్షాకాలం కావడంతో ఈ ట్రాక్‌లపై రైళ్లు నిలిపితే ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడే అవకాశం ఉంది.



మంచు సోయగం



మోతుగూడెం, జూలై 6: చింతూరు మండలం మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. పొగ మంచుతో కొండలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

బాలబాలాజీ ఆదాయం రూ.2,26,516

మామిడికుదురు, జూలై 6: అప్పనపల్లి బాలబాలాజీస్వామికి శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.2,26,516 ఆదాయం సమకూరిందని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. శనివారం స్వామివారిని 2,841 మంది భక్తులు దర్శించుకున్నారని, 2,175 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారని తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



క్యూలో నిల్చున్న భక్తులు

రామచంద్రపురం మున్సిపల్ డీఈఈ గుండెపోటుతో మృతి



మండపేట/ద్రాక్షారామ, జూలై 6: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మున్సిపల్ డీఈఈ దుర్గాప్రసాద్ శనివారం గుండెపోటుతో షిర్డీలో మృతి చెందారు. దుర్గాప్రసాద్ కుటుంబ సమేతంగా రెండు రోజులు క్రితం షిర్డీ వెళ్లారు. ఆయన శనివారం స్వామివారి దర్శనం కోసం క్యూలో ఉండగా గుండెపోటు రావడంతో క్యూలైన్‌లోనే ప్రాణాలు విడిచారు. దుర్గాప్రసాద్ సమర్థవంతమైన అధికారిగా మంచి పేరుంది. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన సుదీర్ఘకాలం మండపేట మున్సిపల్ కార్యాలయంలో ఏఈగా పనిచేశారు. ఇన్‌చార్జి కమిషనర్‌గా, డీఈఈగా ఆయన ఇక్కడ పనిచేశారు. విజయవాడ నగర కార్పొరేషన్‌లో కూడా విధులు నిర్వర్తించారు. మండపేట నుంచి రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయానికి పదోన్నతిపై డీఈఈగా బదిలీ అయ్యారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జునచౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, రెడ్డి రాజబాబు, మండపేట మున్సిపల్ డీఈఈ ఆర్.శ్రీనివాస్, మున్సిపల్ ఆర్‌ఐ ఐ.ప్రభాకరచౌదరి, మండపేట, రామచంద్రపురం మున్సిపల్ ఉద్యోగులు సంతాపం తెలిపారు.

చేపల మృత్యువాత

ఆక్సిజన్ అందక చనిపోతున్న సముద్రపు చిన్న చేపలు



ఒడ్డున మృతిచెందిన చేపలు



యానాం, జూలై 6: యానాం గౌతమి గోదావరి నది ఒడ్డున సముద్రపు చేపలు మృత్యువాత పడి తేలాయి. సాయంత్రం చేపలు చనిపోయి ఒడ్డుకు చేరిపోవడంతో స్థానిక మత్స్యకారులు అక్కడికి చేరుకున్నారు. గోదావరిలో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల యానాం గోదావరికి చప్ప నీరు వస్తుందని, దీంతో ఆక్సిజన్ అందక సముద్రపు చిన్నసైజు చేపలు చనిపోయి ఒడ్డుకు చేరాయన్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● ఎమ్మెల్యే శిరీషాదేవి


విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

రాజవొమ్మంగి జూలై 6: రాజవొమ్మంగి మండలంలోని ఏకలవ్య, గురుకుల పాఠశాలలు, గురుకుల కళాశాలలను ఎమ్మెల్యే శిరీషాదేవి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న భోజన సదుపాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. వాతావరణ మార్పులతో సంబంధం లేకుండా తాగేందుకు వేడినీళ్లు ఇవ్వాలన్నారు.

మొక్కలు పంపిణీ

రాజవొమ్మంగి జూలై 6: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు శనివారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మొక్కలు పంపిణీ చేశారు. మండలంలోని 19 పంచాయతీల రైతులకు శనివారం రాజవొమ్మంగి ఎంపీడీవో కార్యలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, నాయకులు మొక్కలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ ప్రతిఒక్కరికి మొక్కలు అందించే ప్రయత్నం చేస్తామన్నారు. ఎంపీడీవో కార్యాలయానికి రాగానే స్థానిక వైసీపీ ఎంపీపీ గోము వెంకటలక్ష్మి నవ్వుతూ ఆహ్వానం పలకడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, పార్టీలతో సంబంధం లేకుండా మండలాన్ని అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే శిరీషాదేవి చెప్పారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జడ్పీటీసీ వడుగుల జ్యోతి, జనసేన మండలాధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, బీజేపీ మండలాధ్యక్షుడు తాము సూరిబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు గణజాల తాతారావు, ఎంపీడీవో యాదగిరేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ అలీషా

రంపచోడవరం, జూలై 6: ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవిని స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అలీషా, సిబ్బంది శనివారం ఆమె క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, నాన్ టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదే రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'విలీన మండలాలకు అండగా ఉంటా'

కూనవరం, జూలై6: పోలవరం ముంపు మండలాలైన విలీన మండలాల ప్రజలకు అండగా ఉంటానని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష, తెలుగు యువత అధ్యక్షుడు మఠం భాస్కర్ హామీ ఇచ్చినట్లు కూనవరం తెలుగుదేశం నాయకులు తెలిపారు. ఆయా మండలాలకు చెందిన నాయకులు శనివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరంతో పాటు రోడ్లు, పాఠశాలలతో పాటు అనేక సమస్యలు ఉన్నాయని వీటిపై ఈ ఐదేళ్లలో పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ స్టేట్ ఆర్గనైజర్ సెక్రటరీ సోడెం మధుసూదనరావు, వీఆర్‌పురం మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు గొంది చంద్రయ్య, చింతూరు నాయకులు టి.తమ్మయ్య, రాము, చక్రపాణి పాల్గొన్నారు.

ఐదేళ్లకు గుంతల రహదారికి మోక్షం

● ఎటపాక నుంచి కన్నాయిగూడెం వరకు ప్రారంభమైన పనులు


గుంతల మరమ్మతుల పనులు చేస్తున్న దృశ్యం

ఎటపాక, జూలై 6: ఎట్టకేలకు ఐదేళ్ల తర్వాత గుంతల రహదారికి మోక్షం లభించింది. రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని ఎటపాక- నుంచి కన్నాయిగూడెం వరకు శనివారం రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఈ రోడ్డు ఇప్పటివరకు వాహనాలు ప్రయాణించడానికి వీల్లేకుండా గుంతలతో అధ్వానంగా మారింది. ఈ రహదారిపై తెలంగాణ- ఆంధ్రా రాష్ట్రాల నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తెలంగాణలోని భద్రాచలం నుంచి మధ్యలో ఏపీలోని కన్నా యిగూడెం వరకు సుమారు 9 తొమ్మిది కిలోమీటర్లు ఏపీ మీదుగా వాహనాలు తెలంగాణకు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఇటీవల ఈ రహదారి అధ్వాన పరిస్థితిపై తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించి ఏపీ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఆర్‌అండ్‌బీ శాఖ పర్యవేక్షణలో శనివారం నుంచి మరమ్మతుల పనులు ప్రారంభించారు. ఎటపాక నుంచి కన్నాయిగూడెం వరకు సుమారు 9తొమ్మిది కిలోమీటర్ల మేర పనులు చేపడు తున్నారు. గుంతలు పడిన చోట్ల క్రషర్ బూడిద, 40 ఎంఎం మెటల్‌తో గుంతలు పూడ్చుతున్నారు. ఆ త ర్వాత రోలర్‌తో రోలింగ్ చేస్తున్నారు. నేటితో మరమ్మతుల పనులు పూర్తికానున్నట్లు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు తెలిపారు.

ఆర్‌అండ్‌ఆర్ జాబితాలో చేర్చి, పరిహారం ఇప్పించండి

● రైతు సంఘం, వ్యవసాయ సంఘం నాయకులకు వినతి


రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం వ్యవసాయ నాయకులు

ఎటపాక, జూలై 6: గోదావరి వరద వస్తే తొలుత తమ గ్రామమే ముంపునకు గురువుతుందని, తమ గ్రామానికి పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం, పునరావాసం కల్పించాలని ఈ అంశంను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వీరాయిగూడెం గ్రామస్థులు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డిని కోరారు. ఉపాధి పనిదినాలు ముగిశాయని, వర్షాకాలం మూడు నెలల పాటు పనుల దొరక్క ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని తెలిపారు. నందిగామలో రైతులతో మాట్లాడారు. గతంలో పోలవరం భూసేకరణలో తమ భూములు ప్రభుత్వానికి ఇచ్చామని, అప్పటి నుంచి బ్యాంకులు వ్యవసాయానికి పెట్టుబడి ఇవ్వడం లేదన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్లు, గద్దల హుస్సేన్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరదల పట్ల అప్రమత్తత అవసరం

ఎటపాక, జూలై 6: వర్షాలు పడడంతో గోదావరికి వరదలు వచ్చే అవకాశముందని, వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజా ప్రతినిధులు కోరారు. శనివారం గోదావరి వరదలపట్ల ప్రతీ గ్రామ పంచాయతీలో గ్రామసభలను నిర్వహించారు. జూలై -ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వరదలు రానున్నాయని, ప్రతీ గ్రామంలో ప్రజలు అప్రమత్తతతో ఉండాలని సూచించారు. ముంపు లేని ప్రాంతాల్లో బఫర్ స్టాక్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. వరదల సమయంలో సోలార్ లైట్లు, కొవ్వొత్తులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ప్రజలు ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కందుకూరి స్వర్ణ, సర్పంచ్ గడ్డం భద్రమ్మ, సెక్రటరీ స్వాతిదేవి, టీడీపీ నాయకులు బొల్లా పుల్లయ్య ఎంపీటీసీ కంటే రాజు పాల్గొన్నారు.

70 పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్

వై.రామవరం, జూలై 6: ప్రపంచ జునోసిస్‌డేను పురస్కరించుకుని శనివారం వై.రామవరం మండలంలో 70 పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ వ్యాక్సిన్లను వేసినట్లు పశు సంవర్ధక సహాయకులు డాక్టర్ యు.వీరేంద్ర తెలిపారు. మండలంలోని పలు పంచాయతీ గ్రామాల్లో తమ సిబ్బందిచే వ్యాక్సిన్లు వేయించారన్నారు. రేబిస్ వ్యాక్సిన్ కనుగొన్న ప్రత్యేక శాస్త్రవేత్త లూయిపాశ్చర్ కుక్కకాటు బాధితుడికి ప్రపంచంలోనే తొలిసారి వ్యాక్సిన్ వేసిన రోజును గుర్తు చేసుకుంటూ ప్రతీఏటా జూలై 6వ తేదీన జునోసిస్‌డే జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సిబ్బంది పాల్గొన్నారు.


వై.రామవరం లో కుక్కకు వాక్సిన్ వేస్తున్న పశువైద్యులు

'ఖైదీల ఆరోగ్య భద్రతకు పెద్దపీట'

రాజమహేంద్రవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఖైదీల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తున్నామని సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ పేర్కొన్నారు. యోగానంద నేత్రాలయ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జైలులోని సేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జైళ్ల శాఖ కల్పిస్తున్న శిక్షణను ఉపయోగించుకొని మానసిక పరివర్తన చెంది విడుదలైన తర్వాత సమాజానికి, కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ట్రస్టుకు రూ.25 వేలు అందజేసిన ఆమెన్ ట్రస్టు ప్రతినిధులను అభినందించారు. నేత్ర పరీక్షల అనంతరం మందులను అందజేశారు.

తప్పుచేస్తే శిక్ష తప్పదు

● ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలి
● ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 6: తప్పు చేస్తే ఎంతటివారికైన తమ కూటమి ప్రభుత్వం శిక్ష తప్పదని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హెచ్చరించారు. రాజమహేంద్రవరం 45వ డివిజన్ ఆర్‌అండ్‌బీ వాంబే కాలనీ కమ్యూనిటీ హాలులో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు బుద్ధి చెప్పినా, ఛీత్కరించినా వైసీపీ నాయకుల బుద్ధులు మారడంలేదని, ఇంకా అధికారంలో ఉన్నా మనే భ్రమలోంచి బయటకురావాలన్నారు. అధికారంలో ఉన్నది కూటమి అని గుర్తించుకోవాలన్నారు. తప్పుచేసిన వారెవరైనా శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రజలు ఎందుకు మిమ్మల్ని ఓడించారో ఆలోచించుకోవాలే తప్ప సందుదొరికితే చాలు ప్రచారం కోసం ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇక్కడ కమ్యూనిటీ హాలు టీడీపీ హయాంలో కడితే అటుపై అధికారంలోకి వచ్చాక మంత్రి వేణు ప్రారంభించారని, ఎప్పుడైనా ఇక్కడకువచ్చి ఈ కమ్యూనిటీ హాలు దుస్థితిని చూసావా అని భరత్‌రామ్‌ను ప్రశ్నించారు. రంగులు వేసుకోవడంలో చూపించిన శ్రద్ధ కమ్యూనిటీ హాలు బాగుచేయించలేకపోయారని మండిపడ్డారు. చిల్లర రాజకీయాలు చేసి రాజకీయ లబ్ధికోసం మరోసారి పబ్లిసిటీ స్టంట్ చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. భరత్ కుటుంబంతో శివాజీ అనే వ్యక్తి 6నెలలుగా ఉన్నాడు. అతనికి ఒక పెద్దాయనతో 52 సార్లు ఫోన్‌లో మాట్లాడారు. ఆ కాల్ డేటా తీస్తే ఏ1, ఏ2, ఏ3 ఇలా చాలా ఉంటాయన్నారు. రాత్రి పది గంటలకు పార్టీ ఆఫీసులో మందు తాగుతున్నారు, అది కార్యాలయ మా పబ్బా అని ప్రశ్నించారు. మీరు కాల్చేసుకుని, అది అవాస్తమని దేవుడిపై ఒట్టువేస్తాడట. దేవుడుతో రాజకీయాలు చేయడం కరెక్ట్ కాదని వాసు అన్నారు.

కమ్యూనిటీ హాలుకు త్వరలో మరమ్మతులు

వాంబే కాలనీలోని కమ్యూనిటీ హాలుకు త్వరలో మరమ్మతులు చేయిస్తామని ఎమ్మెల్యే శ్రీనివాస్ అన్నారు. డివిజన్‌లో పర్యటించిన ఆయన తొలుత కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. టీడీపీ హయాంలో నిర్మించిన ఈ హాల్‌ను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పూర్తిగా పాడైందన్నారు. మరమ్మతులు చేయాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి వచ్చిన అర్జీలను అధికారులకు అందించి వాటిని పరిష్కరించాలని ఆదే శించారు. కాలనీలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపించాలన్నారు. ఇంటి కోసం పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చిన లబ్ధిదారులకు పట్టాలను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో టీడీపీ పార్లమెంట్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొయ్యల రమణ, దాస్యం ప్రసాద్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు సమన్వయంతో పనిచేయాలి

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


అధికారులతో నిర్వహించిన సమీక్షలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూలై 6: సీజనల్ వ్యాధుల నివారణకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యంగా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాల్లో మంచినీటి సరఫరాపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం అనపర్తిలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నియోజకవర్గస్థాయిలో ఎంపీడీ వోలు, ఈవోపీఆర్డీలు, ఆర్‌డబ్ల్యుఎస్, ఐసీడీఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మంచినీటి సరఫరా, పారిశుధ్యం, వైద్యసేవలు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో ఉన్న మంచినీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై తలెత్తుతున్న జాప్యాన్ని పలువురు ఎన్డీయే నాయకులు సమావేశం దృష్టికితీసుకువచ్చారు. కొన్ని గ్రామాల్లో అనేకచోట్ల మంచినీటి పైప్‌లైన్లలో లీకేజీలు ఏర్పడి మంచినీరు కలుషి తంగా మారుతుందని సమావేశం పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న స్టాప్ డయేరియాపై ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో మంచి నీటి సరఫరాలో జరుగుతున్న ఇబ్బందులను గుర్తించి సరిచేయాల న్నారు. ఇటీవల రంగంపేట మండలం అచ్యుతాపురంలో డయేరియా కేసులు రావడం వెనువెంటనే అధికారులు అప్రమత్తమై చర్యలు చేపట్టడంతో డయేరియాను అరికట్టగలిగామన్నారు. దీనికి సిబ్బందిని ప్రత్యేకంగా అభి నందిస్తున్నట్లు ఆయన తెలిపారు. సీజనల్ వ్యాధులపై అటు వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి, నాలుగు మండలాల ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, ఐసీడీఎస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
● తొర్రిగడ్డ పంపింగ్ స్కీం ద్వారా సాగుగనీరు విడుదల


తొర్రిగడ్డ పంపింగ్ స్కీం ద్వారా నీరు విడుదల చేసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

సీతానగరం, జూలై 6: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. శనివారం ఉదయం ఆయన టీడీపీ రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరితో కలసి తొర్రిగడ్డ పంపులకు స్విచ్ ఆన్‌చేసి సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ 14వేల ఎకరాల ఆయకట్టు కలిగిన తొర్రిగడ్డ పంపింగ్ స్కీంకు పంటభూముల వరకు నీరందిస్తామన్నారు దీంతోపాటు ఇతర ఎత్తిపోతల పథకాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకున్నామని, రైతుల సంక్షేమం కోసం కృషిచేస్తామన్నారు. అనంతరం బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా పురుషోత్తపట్నం గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సీతానగరం ప్రభుత్వోన్నత పాఠశాలలో విద్యార్థులకు కిట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గద్దే వెంకటకృష్ణచౌదరి, నీరుకొండ శివ, గెడ్డం తిమ్మారావు, మేడిశెట్టి శివరామ్, వలవల రాజా, నానాజీ, చిట్టూరి రంగారావు నాగారపు సత్యన్నారాయణ, మట్టా వెంకటేశ్వరరావు, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నర్సరీల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

● జిల్లా కలెక్టర్‌కు విన్నవించిన మార్గాని


కలెక్టర్ ప్రశాంతికి మొక్కను అందజేస్తున్న మార్గాని

కడియం, జూలై 6: కడియం నర్సరీల అభివృద్ధికి తగిన తోడ్పాటు అం దించాలని జిల్లాకలెక్టర్ పి. ప్రశాంతిని కడియపులంక నర్సరీ రైతు, టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ కోరారు. శనివారం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కడియం నర్సరీల ప్రగతిని వివరించారు. నర్సరీల గురించి తాను కూడా విన్నానని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. నర్సరీలు దేశవ్యాప్తంగా ఉన్నప్పటికీ కొన్నిరకాల మొక్కల ఉత్పత్తికి ఇతర రాష్ట్రాల నర్సరీలు పరిమితం అని ప్రపంచ వ్యాప్తంగా దొరికే మొక్కలు ఒక కడియం నర్సరీ రైతులు మాత్రమే సేకరించి అభివృద్ధి చేస్తారని మార్గాని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నర్సరీలకు వచ్చే రాయితీలు వచ్చే విధంగా తోడ్పాటు అందించాలని మార్గాని కోరారు.

గ్రామాల్లో మెరుగుపడుతున్న పారిశుధ్యం

రాజమహేంద్రవరం రూరల్, జూలై6: జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాలతో రూరల్ మండల పరిధిలోని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులు నిర్వహిస్తున్నారు. వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పలు చర్యలు చేపడుతున్నారు. గత కొన్నేళ్లుగా పారిశుధ్య పనులతోపాటు కొన్ని ప్రాంతాల్లో కనీసం రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను కూడా శుభ్రం చేయకపోవడంతో ఏపుగా పెరగడంతో వాహనాదారులు పలు ఇబ్బందులు పడేవారు. ప్రధాన రహదారులకే పారిశుధ్య నిర్వహణపనులు పరిమితమయ్యేవి. డ్రైనేజీలలో పూడికలు తీయకపోవడంతో కొన్ని ప్రాంతాలు ముంపునకు గురైన సంఘటనలు కూడా ఉండేవి. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆదేశాలతో టీడీపీ నాయకులు కూడా పారిశుధ్య నిర్వహణ పనులలో పాలుపంచుకుంటున్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

● ఇన్‌చార్జి జిల్లా జడ్జి శివకుమార్

రాజమహేంద్రవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఇన్‌చార్జి జిల్లా జడ్జి, 1వ అదనపు జిల్లా జడ్జి ఆర్.శివకుమార్ పేర్కొన్నారు. రవాణా, ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో న్యాయమూర్తులు, కోర్టు సిబ్బందికి రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి వేగం, నిర్లక్ష్యంగా నడపడం ప్రమాదకరమన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వల్ల ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. హెల్మెట్, సీట్ బెల్టు లేకుండా వాహనం నడపడం నేరమని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు, ఎంవీఐ జి.రామ్ నారాయణ్, ఏఎంవీఐ ఎన్.సబిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి

● మొక్కలు నాటిన ఎమ్మెల్యే నల్లమిల్లి


కొంకుదురులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, జూలై 6: భారత జనసంఘ్ వ్యవస్థాపకుడు, బీజేపీ ఏర్పాటుకు మూలకారకులైన శ్యాంప్రసాద్‌ముఖర్జీ జయంతి వేడుకలను కొంకుదురులో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే రామ కృష్ణారెడ్డి మాట్లాడుతూ శ్యాంప్రసాద్ బీజేపీకి ఎనలేని సేవలు అందించారన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన మొక్కవేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నేతలు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, సబ్బారపు సూర్యనారాయణ, ఇందల వీరబాబు, సిరసపల్లి నాగేశ్వరరావు, రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి కోసం పాటుపడిన జగ్జీవన్‌రామ్

అనపర్తి, జూలై 6: తన రాజకీయ జీవితంలో పేద ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం పాటు పడిన మాజీ ఉప ప్రధాని దివంగత బాబూ జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయుడని అనపర్తి నియోజకవర్గ ఎన్డీయే కూటమి నాయకులు అన్నారు. శనివారం జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా అనపర్తిలోని జగ్జీవన్‌నగర్‌లో ఆయన విగ్రహానికి కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తమలంపూడి సుధాకరరెడ్డి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, నాయకులు నూతిక బాబూరావు, బాసి, మామిడిశెట్టి శ్రీను, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంరూరల్: రాజమహేంద్రవరం రూరల్ మండలం


బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపఠానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పరిధిలో పలు ప్రాంతాల్లో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. బొమ్మూరు 220 కెవీ సబ్ స్టేషన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాయుడు రమేష్‌బాబు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఈ కె.వి జయ్‌కుమార్, ఏఏఓ బాలసుబ్రహ్మణ్యం, డీఈఈ ఎంఎస్ విద్యాసాగర్, డీఈఈ శివరామకృష్ణ, ఏడీఈ షర్మిళాదుర్గ, కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వేమగిరిలో స్వచ్ఛాభారత్

కడియం, జూలై 6: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున పరిసరాల పరిశుభ్రతకు కలిసికట్టుగా పాటుపడదాం అంటూ వేమగిరితోటకు చెందిన టీడీపీ నాయకులు శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పిలుపునివ్వడంతో మాజీ ఎంపీటీసీలు వాసంశెట్టి నాగబాబు, అప్పారి అన్నవరం టీడీపీ శ్రేణులు జోగి చక్రవర్తి, యనమదల రాజు, వాసంశెట్టి బాలాజీ తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మామిడిశెట్టి మణికంఠ, పునుకు రవి, మహాలక్ష్మి, వెంకటేశ్వరరావు, హెచ్ఎం వీవీ రాజు, ఉపాధ్యాయులు ఆర్.శ్రీరాములు, కె.శ్రీనివాసరావు, పి.రామకృష్ణ, అంగన్‌వాడీలు, పిరమిడ్ ధ్యానకేంద్ర ప్రతినిధులుపాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్ తప్పనిసరి

● ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 6: పెంపుడు జంతువులకు వ్యాక్సినేషన్ తప్పనిసరి అని, జంతు ప్రేమికులు ప్రతి ఒక్కరూ పెంపుడు జంతువుల ఆరోగ్యంతోపాటు వాటి నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా ఉండేందుకు సకాలంలో వ్యాక్సినేషన్ అందించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శనివారం ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా రాజమహేంద్రవరం ఏరియా పశు వైద్యశాలలో పెంపుడు జంతువులకు ఉచిత వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వాసు ప్రారంభించి మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధుల్లో అతి ముఖ్యమైనది ర్యాబిస్ అని అన్నారు. స్వైన్ ఫ్లూ, బర్డ్ ఫ్లూ, మెదడు వాపు, క్షయ, బ్రూసెల్లోసిస్, వంటి వ్యాధులు సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఏటా జూలై 6న జునోసిస్ డే జరుపుకుంటునట్టు చెప్పారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ టి.శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు కె.సత్యనారాయణ పశు సంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.

8న వైఎస్సార్ వజ్రోత్సవ జయంతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 6: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వజ్రోత్సవ జ యంతిని ఈనెల 8న మంగళగిరిలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ రాజమహేంద్రవరం అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ తెలిపారు. ఈ మేరకు వజ్రోత్సవ జయంతి పోస్టర్‌ను స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ పెద్దలతోపాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పెద్దలు హాజరవుతున్నారని, భారీగా కార్యకర్తలు, నాయకులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చామర్తి లీలావతి, యిజ్జరౌతు సత్యనారాయణ, బిల్డర్ బాబీ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో మొక్క నాటే కార్యక్రమం

రాజమహేంద్రవరంకల్చరల్ జూలై 6: శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అమ్మ పేరుతో మొక్క నాటడం కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి మాట్లాడుతూ మనం ఆనందంగా జీవించడానికి అమ్మే కారణమని, మొక్కలను నాటడమే కాకుండా, పూర్తి బాధ్యతతో చక్కగా పెరిగేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు కె.వీరలక్ష్మి, ఎంకే విజయలక్ష్మి, యూత్ రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ వీబీటీ సుందరి, సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు

● మెయిన్ రోడ్డు పరిశీలనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి


మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 6: రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శనివారం రాత్రి రాజమహేంద్రవరం మెయిన్‌రోడ్డు కోటగుమ్మం నుంచి ఛాంబర్ ఆఫ్ కామర్స్ వరకు ట్రాఫిక్ తీరును కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ మెయిన్ రోడ్డులో ట్రా ఫిక్ సమస్య తలెత్తకుండా టౌన్‌ప్లానింగ్ అధికారులు, ట్రా ఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. షాపులకు వచ్చే కస్టమర్ల వాహనాలు, షాపుల్లో పనిచేసే సిబ్బంది వాహనాలు నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే ఉంచాలన్నారు. షాపుల ఎదుటపార్కింగ్ చేయరాదన్నారు. ఈ మేరకు అధికారులు ముందుగానే వారికి తెలియజేసేవిధంగా గోడ పత్రికలు అంటించాలన్నారు. అధికారులు ట్రాఫిక్ సమస్యలను సున్నితంగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకుడు యిన్నమూరి దీపు పాల్గొన్నారు.

ఇసుక లారీలను పట్టుకున్న జనసేన నాయకులు

సీతానగరం, జూలై 6: ములకల్లంక నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న 3, 10టైర్స్ లారీలను శుక్రవారంరాత్రి జనసేన నాయకులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ లారీలు టీడీపీ వారికి చెందినవిగా తెలుస్తోంది ఇప్పటివరకు గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా జరిగింది. ప్రభుత్వం మారిన తరువాత కొత్తవారు తయారయ్యారంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ధవళేశ్వరం, జూలై 6: రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల,పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టీఎన్‌టీయూసీ నాయకుడు యర్రమోతు ధర్మరాజు ముఖ్యమంత్రికి లేఖ ద్వారా కోరారు. నవ్యాంధ్ర ముఖ్యమంత్రిగా మొదటిసారి బాధ్యతలు చేపట్టినప్పుడు ఉద్యోగులకు వేతన సవరణ ద్వారా 43 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడం, పదవీ విరమణ వయస్సు 60 సంవత్సరాలకు పెంచి ఉద్యోగుల పక్షపాతిగా పేరుతెచ్చుకున్నారన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తాం

● ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

సీతానగరం, జూలై 6: మండల కేంద్రమైన సీతానగరం మండల పరిషత్ కార్యాలయంవద్ద ఎంపీడీ వో కృష్ణ చైతన్య అధ్యక్షతన 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ పార్టీలకు అతీతంగా అన్ని పార్టీలవారికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేద్దామన్నారు. ఏపీవో నాగేశవేణి మాట్లాడుతూ 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి నెలఖరు వరకు మండలంలో జరిగిన 1098 పనులలో కూలీల చెల్లింపులు రూ.7.52కోట్లు మెటీరియల్‌కు రూ.94.86లక్షలు ఖర్చు చేశామన్నారు. అనంతరం ప్రజావేదికలో గ్రామాలలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ వివరాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జోత్స్న, జడ్పీటీసీ చల్లమళ్ళ వెంకటలక్ష్మి ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కోసం సైకిల్ యాత్ర



దివాన్‌చెరువు, జూలై 6: ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు ప వన్ కళ్యాణ్‌పై అభిమానంతో విజయవాడకు చెందిన నంది సత్యనారాయణ అరసవిల్లి వరకు చేపట్టిన సైకిల్‌యాత్ర శనివారం రాజానగరం చేరుకుంది. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేగా ఎన్నికై ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో శ్రీకాకుళంజిల్లా అరసవిల్లిలోని సూర్యనారాయణకు మొక్కు చెల్లించుకునేందుకు ఈనెల 1న విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధి నుంచి ఈయాత్ర ప్రారంభించానన్నారు. రోజుకు 25 కిలోమీటర్ల వంతున యాత్ర చేస్తూ, మార్గమధ్యలో కూటమి ఎమ్మెల్యేలను కలుస్తూ తాను యాత్ర సాగిస్తున్నట్లు చెప్పారు. ఆదికవి నన్నయ వర్శిటీ వద్ద సత్యనారాయణను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కలిసి అభినందించారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు ఖండన

రాజమహేంద్రవరం సిటీ, జూలై 6: తమిళనాడు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను హత్య చేయడాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం సాయంత్రం ఆరుగురు దుండగులు బైక్‌లపై వచ్చి ఆయన్ను అతికిరాతకంగా హత్య చేశారన్నారు. పార్టీని తమిళనాడులో బలోపేతం చేస్తున్న ఆర్మాస్ట్రాంగ్‌ను హత్య చేసిన సంఘటనపై ఆ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులు ప్రగాఢ సంతాపం తెలిపారు.



గోదారికి వరద



ధవళేశ్వరం, జూలై 6 : గోదావరి రంగుమారుతోంది.. నేనొస్తున్నానంటూ హెచ్చరిక జారీ చేసింది.. ఎందుకంటే గోదావరికి వరద నీరు నీరొస్తుంది. వర్షాకాలం సీజన్ ప్రారంభమైన తరువాత ఎగువ నుంచి వచ్చే వరద నీటి కారణంగా గోదావరి రంగు మారుతోంది.. ఆ నీరు క్రమక్రమంగా పెరిగి వరదలా మారుతుంది.. వర్షాకాలం ముగిసిన వెంటనే గోదావరి మళ్లీ రంగుమారుతోంది.. నీరు సాధారణ స్థితిలోకి వచ్చేస్తుంది. ఈ ఏడాది ఇప్పుడిప్పుడే మొదటిసారిగా గోదావరికి ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు వచ్చి చేరుతుం డడంతో ఎరుపు రంగు సంతరించుకుని ప్రవహిస్తూ కనువిందు చేస్తుంది.శనివారం కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టా ప్రధాన పంట కాలువకు 3 వేల క్యూసెక్కులు,మధ్య డెల్టా ప్రధాన పంట కాలువకు 2420 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా ప్రధాన పంట కాలువకు రూ.4 వేల క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.గోదావరికి వరద వచ్చే అవకాశం ఉండడంతో 40,866 క్యూసెక్కులు మిగులు జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం ఆర్మ్‌లోని 35 గేట్లు, ర్యాలీ ఆర్మ్ లోని 10 గేట్లు, మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లోని 5 గేట్లు 20 మిల్లీమీటర్ల మేర పైకి ఎత్తారు. ధవళేశ్వరం గోదావరి నీటి 10.90 అడుగులుగా నమోదైంది.

సముద్రంలోకి 40,866 క్యూసెక్కులు విడుదల



టీడీపీ నాయకులపై వైసీపీ నాయకుడి దాడి

ఇద్దరిపై పెప్పర్ స్ప్రే, యాసిడ్‌తో దాడి - అనంతపల్లిలో వైసీపీ జగడం

నల్లజర్ల, జూలై 6 : వైసీపీకి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పినా.. ఆ పార్టీ నాయకుల ఆగడాలు మాత్రం తగ్గడం లేదు. ప్రతి రోజూ ఏదో ఒక చోట షరా మామూలుగా గొడవలకు దిగుతూనే ఉన్నారు. తాజాగా తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లిలో వైసీపీ కార్యకర్త.. టీడీపీ నాయకులపై పెప్పర్ స్ప్రే, యాసిడ్‌తో దాడి చేశాడు. వివరాలిలా ఉన్నాయి.. అనంతపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గురుమిల్లి వెంకట సూర్యనారాయణ, చింతా గణేశ్ శుక్రవారం రోడ్డుపై నిలబడి మాట్లాడుకుంటున్నారు.ఆ సమయంలో అటుగా వచ్చిన వైసీపీ కార్యకర్త యెర్నేని సన్యాసిరావు టీడీపీ నాయకుడు సూర్యనారాయణను దుర్భాషలాడి వెళ్లిపోయాడు.దీంతో ఆగ్రహించిన టీడీపీ నాయకుడు గ్రామ పెద్దల్లో తగువు పెట్టాడు. అక్కడికి వచ్చిన సన్యాసిరావు తగువు ప్రారంభించిన వెంటనే సూర్యనారాయణ, గణేశ్ ముఖాలపై పెప్పర్ స్ప్రే కొట్టి యాసిడ్ పోసి పారిపోయాడు. దీంతో వారిని స్థానికులు 108 వాహనంలో నల్లజర్ల పీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతున్నారు. టీడీపీ నాయకుల కంటి చూపు మందగించిందని మెరుగైన చికిత్స అందించాల్సి ఉందని వైద్యులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వైసీపీ ఆగడాలు నిర్మూలించి దాడి చేసిన సన్యాసిరావును, ప్రోత్సహించిన వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, టీడీపీ నాయకుడు గురుమిల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.



రాజమహేంద్రవరంలో ఎంపీ కార్యాలయ నిర్మాణానికి పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతుల భూమిపూజ

రేపు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 6 : రాజమహేంద్రవరంలో సోమవారం నిర్వహించనున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవంతం చేయాలని బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సూచించారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె నిర్వహణ కమిటీల ఇన్‌ఛార్జిలతో మాట్లాడారు. సమావేశం విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు. అనంతరం జేఎన్ రోడ్డులోని కోస్టల్ గార్డెన్స్‌లో తన నివాసానికి ఆనుకుని నిర్మిస్తున్న క్యాంపు కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. ఈ మేరకు ఎంపీ పురందేశ్వరి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు దంపతులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. లోక్‌సభలో ప్రమాణస్వీకారం చేసిన తరువాత తొలిసారిగా వచ్చిన ఆమెను కొత్త కలెక్టర్ ప్రశాంతి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సీతానగరం కార్యదర్శి సతీష్ సస్పెన్షన్

సీతానగరం,జూలై 6 : సీతానగరం పంచాయతీ కార్యదర్శి సిహెచ్.నాగ సతీష్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం డీపీవో ఉత్తర్వులు జారీ చేశారు. పర్యవేక్షణలో విఫలమైనందున ఈవోపీఆర్‌డీ కేవీవీఎస్ఎస్.మూర్తికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. సీతానగరం పంచాయతీ పరిధిలో కలెక్టర్ పశాంతి పర్యటించిన సమయంలో గ్రామంలో పారిశుధ్యం నిర్వహణ, తాగునీటి సరసరాపై నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు తేలింది.కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్టు డీపీవో రాంబాబు తెలిపారు. ప్రస్తు తం వంగలపూడి పంచాయతీ కార్యదర్శి సుజాతకు బాధ్యతలు అప్పగించారు.

వేధింపులు నివారణకు 78 కమిటీలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 6 : పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించే దిశగా జిల్లా, మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం 2013పై ఫిర్యాదుల కమిటీ, నోడల్ అధికారులతో నిర్వహించిన శిక్షణ తరగతులకు హాజరై మాట్లాడారు. ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేసే ప్రతి కార్యాలయంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా స్థాయి కమిటీలో కలెక్టర్, చైర్‌పర్సన్‌గా డీఎం, సివిల్ సప్లయిస్ టి.రాధిక, ఎక్స్ అఫీషియోసభ్యులుగా ఐసీడీఎస్ పీడీ విజయకుమారి, సభ్యులుగా గిరిజన సంక్షేమ అధికారి కే ఎన్.జ్యోతి, డీఎల్‌డీవో పి.వీణాదేవి, ఏకలవ్య చిల్డ్రన్ హోమ్ ప్రతినిధి పి .శేషారత్నంను నియమించినట్లు తెలిపారు. జిల్లాలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధించే 78 కమిటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులతో శానిటేషన్ నిర్వహణపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక శానిటేషన్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తాగునీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు.

రాజమండ్రిలో ఫస్ట్ ప్లాట్‌ఫాంపై రైళ్ల నిలిపివేత 8

ఇసుక ఆనందం



రేపటి నుంచి ఇసుక ఉచితం

- స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక సరఫరా
- లోడింగ్ చార్జీలు రూ.200
- దూరాన్ని బట్టి మారనున్న ధర
- జిల్లాలో 7 స్టాక్ పాయింట్లు
- ప్రస్తుతానికి ఆఫ్‌లైన్‌లో అందజేత
- అక్టోబర్ తర్వాత ఆన్‌లైన్‌లో
- నేడు ర్యాంపుల్లో ఇసుక లెక్క
- నెరవేర్చిన కూటమి రెండో హామీ
- పేదింట సంతోషం

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

ఇసుక కష్టాలు ఇంతింతకాదయా...ఇదీ ఐదేళ్లగా ప్రజల నోట వినిపించే మాట..ఎందుకంటే గోదావరి చెం తనే ఉన్నా యూనిట్ ఇసుక కావాలన్నా ఇబ్బందులే.. వేలకు వేలు పోస్తేనే ఇసుక ఇంటికి చేరేది.. ఒకనాడు అయితే ఎమ్మెల్యేలు.. ఎంపీల సిఫారసులు ఉంటేనే ఇసుక అందేది.. పేద మధ్య తరగతి ప్రజలకు ఇసుక అందడమే గగనమైపోయింది.. జగనన్న ఇళ్ల కాలనీ వాసులు ఇసుక కోసం ఎంతలా అల్లాడారో వాళ్లకే తెలుసు.. ఇసుక కొనలేక చాలా మంది ఇళ్లు కట్టలేకపోయారు.. కొంత మంది ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి.. అయినా పాలకుల్లో కనీస కదలిక లేదు.. ఎప్పుడూ మీకెంత.. మాకెంత.. ప్రజల గురించి ఆలోచనే లేదు..అదే ఫ్యాన్ రెక్కలు విరిచింది..కూటమి ప్రభుత్వం వచ్చింది.. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించి దాదాపుగా నెలరోజులవుతుందో లేదో.. అప్పుడే ప్రజల గురించి ఆలోచించడం ఆరంభించారు..ఇసుక ఉచితం అంటూ పేదింటికి తీపి కబురు చెప్పారు.. చెప్పడమే కాదు.. రేపటి నుంచే అమల్లోకి తెస్తున్నారు.దీంతో ప్రజల కష్టాలు తీరనున్నాయి. భవన నిర్మాణ రంగం పుంజుకోనుంది.

స్టాక్ పాయింట్ల నుంచే సరఫరా

సోమవారం నుంచి స్టాక్ పాయింట్లలో ఇసుకను మాత్రమే ఇస్తారు. స్టాక్ పాయింట్లలో అంటే గోదా వరి నుంచి ఇసుక తీసి లారీల ద్వారా తీసుకొచ్చి ఒక స్టాక్ పాయింట్‌లో వేస్తారు. దీనికి అయిన ఖర్చును మాత్రం వసూలు చేస్తారు. ప్రస్తుతం ఆఫ్‌లైన్‌లోనే ఇసుకను సరఫరా చేస్తారు. అక్కడే డబ్బు తీసుకుని మాన్యువల్‌గా బిల్లు ఇస్తారు. ప్రతి రోజు సాయంత్రం ఖర్చులు, సీనరేజ్,ఇతర చార్జీలను జిల్లా కలెక్టర్, మైన్స్ ఏడీ పేర ఉన్న జాయింట్ అకౌంట్‌లో జమ చేస్తారు. ప్రస్తుతం స్టాక్ పాయింట్ వద్ద నుంచి సరఫరా చేసే ఇసుకకు వసూలు చేసే చార్జీల వివరాలు ఇలా ఉన్నాయి. గోదావరి నుంచి టన్ను ఇసుక తెచ్చి, లోడ్ చేసినందుకు రూ.30, రీలోడింగ్‌కు రూ.30, సీనరేజి రూ.66, జీఎస్‌టి 18 శాతం, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్) రూ.19.68, మెరిట్(ఖనిజాన్వేషన్ నిధి) 2 శాతం. ఈ మొత్తానికి మరో 5 శాతం జీఎస్‌టీ వసూలు చేస్తారు.ర్యాంపు నుంచి స్టాక్ పాయింట్‌కు కిలోమీటర్‌కు రూ.5 వంతున వసూలు చేస్తారు.ఇలా అన్నీ కలుపుకుని సుమారు రూ.200 వరకూ కావచ్చు. గతంలో స్టాక్ పాయింట్ల వద్ద టన్ను ఇసుకను రూ.750 నుంచి 950కు పైగా అమ్మేవారు. ఇవాళ ఉచిత విధానం వల్ల స్టాక్ పాయింట్ వద్ద చార్జీతో పాటు రవాణా చార్జీలు పెట్టుకుని ఇంటికి ఇసుక చేరుతుంది. వర్షాకాలం, గోదావరికి వరదలు వచ్చే సమయం కాబట్టి ఓపెన్ ర్యాంపుల జోలికి వెళ్లడంలేదు. డీసిల్టేషన్ కోసం ఏజెన్సీలను, బోట్స్‌మన్ సొసైటీలను బహుశా టెండర్ల ద్వారా ఎంపిక చేయనున్నట్టు సమాచారం. పూర్తి నిర్ణయాలు ఒకటి రెండ్రోజుల్లో ప్రభుత్వం తీసుకుంటుంది. ఓపెన్ రీచ్‌లు వచ్చిన తర్వాత ర్యాంపుల్లోనే ఇసుక సరఫరా చేసే సమయంలో తగ్గుతుంది.

ఒక్కొక్కరికీ 20 టన్నులు..

ఉచిత ఇసుక విధానం అమల్లోకి రావడంతో అన్నివర్గాల ప్రజలు ఆనం దం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ దోపిడీ విధానం వల్ల నిర్మాణాలు ఆపేసుకున్న సంగతి తెలిసిందే. నిర్మాణ రంగం, రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. ఉచిత ఇసుక వల్ల ఆయా రంగాలన్నీ పుంజుకోనున్నాయి. పేదల నుంచి ధనవంతుల వరకూ ఎవరైనా ఒక వ్యక్తి 20 టన్నుల ఇసుక పొందవచ్చు.సీఎం నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చారు.. వైసీపీ ప్రభుత్వం టన్నుకు రూ.475 నుంచి రూ.625 వసూలు చేయడంతో పాటు, ప్రభుత్వానికి సీనరేజి కట్టలేదు. జీఎస్‌టీ కట్టలేదు. డీఎంఎఫ్ లేదు. మెరిట్ చెల్లించలేదు. రూ.కోట్ల ఇసుక అమ్మకాలు జరిగినా ప్రభుత్వ ఖజానాకు పైసా చేరలేదు. అంతా దోపిడీ అయింది. 20 టన్నుల లారీ ఇసుక రూ.30 వేలకు వరకూ అమ్మిన సంగతి అనుభవమే.

ఏడు స్టాక్ పాయింట్లలో ఇసుక

జిల్లాలోని కాతేరు,లాలాచెరువు,బుర్రిలంక, కుమారదేవం, చిడిపి, పందలపర్రు, పెండ్యాల, ఉసులు మర్రులోని ఏడు స్టాక్ పాయింట్లలో 3 లక్షల టన్నుల ఇసుక ఉంది. దానినే ముందుగా విక్రయిస్తారు. గాయత్రీ, కాతేరు,వెంకటనగర్,కొవ్వూరు తదితర ర్యాంపుల్లో ఇసుక గుట్టలు ఉన్నాయి. అందులో ఎన్ని టన్నుల ఇసుక ఉందనేది ఆదివారం తేల్చనున్నారు. జిల్లాలో 17 ఓపెన్ ర్యాంపులు ఉన్నాయి. సుమారు 32 వరకూ డీసిల్టేషన్ ర్యాంపులు ఉన్నాయి. అవన్నీ ప్రస్తుతం ఆగాయి.ర్యాంపుల్లో మొత్తం 97 బోట్స్‌మన్ సొసైటీలు ఉన్నాయి.

ఇసుక సొమ్ము ప్రభుత్వానికి రూపాయి వెళ్లదు..

కలెక్టర్ ప్రశాంతి



జిల్లా ఉచిత ఇసుక పంపిణీ పాలసీ మార్గదర్శకాలు జవాబుదారీతనంతో ఖచ్చి తంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ఇసుక కమిటీ సమావేశం జరి గింది. ఉచిత ఇసుక విధానంలో కేవలం వినియోగదారుల నుంచి ఇసుక తవ్వకం, రవాణా, పరిపాలనాప ర మైన ఖర్చులు మాత్రమే వసూలు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చార్జీలు వసూలు చేయదని చెప్పారు. లాభాపేక్ష లేకుండా వినియోగదారులకు ఇసుక సరఫరా చేయడమే లక్ష్యమన్నారు. రెవెన్యూ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్టాక్ పాయింట్ వద్ద డిప్యూటీ తహశీల్దార్,ఆపై అధికారి పర్యవేక్షణ చేస్తారన్నారు. మూడు షిఫ్టులలో విధులు నిర్వహిస్తారన్నా రు. ఉచిత ఇసుక విధానంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ ప్రధాన పాత్ర పోషించాలన్నారు. 20 టన్నుల ఇసుక వరకూ వ్యక్తిగత ఆధారాలు, వివరాలు తీసుకుని డీఎల్ఎస్‌సి ద్వారా సమీక్షించి ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో సాగేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా, డివిజన్ స్థాయిలో ఎన్‌ఫోర్స్ మెంట్ టీమ్‌ల ఆధ్వర్యంలో నిరంతర పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా స్టాక్ పాయింట్లు, డీసిల్టేషన్ పాయింట్ల వద్ద మండల రెవెన్యూ,స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో కూడా టీమ్ నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఇసుక రవాణా సక్రమంగా జరిగేలా చూడడం కోసం పోలీసు, రెవెన్యూ, సెబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొత్తగా డీసిల్టేషన్ చేయడానికి ఏజెన్సీలు, బోట్స్‌మెన్ సొసైటీలను టెండర్ ప్రకటన ద్వారా ఎంపిక చేయాలని తెలిపారు. డీసిల్టేషన్ కార్య కలాపాలు మార్గదర్శకాల ప్రకారం, పర్యావరణ, నిర్వహణతో సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాలన్నారు.జల వనరుల శాఖ నదులు, కాలువలు, రిజర్వాయర్లు నుంచి అవసరమైన అన్ని అనుమతులు ఇరిగేషన్ నుంచి పొందాలన్నారు. సమావేశంలో డీఆర్వో జి.నరసింహులు, సబ్- కలెక్టర్ శ్రీ అశుతోష్ శ్రీవాత్సవ, ఆర్‌డీవో ఎ.చైత్రవర్షిణి, మైన్స్ ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం, సెబ్ ఏఎస్పీ పి.సోమ శేఖర్, ఏఎస్పీ ఎం.రాజశేఖర్, ఇరిగేషన్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరావు, డీఆర్‌డీఏ పీడీ ఎస్‌వీవీఎస్.మూర్తి,ఆర్‌డ బ్ల్యూఎస్ ఎస్ఈ డి.బాలశంకరరావు, డీపీవో డి.రాంబాబు, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి వై.శ్రీనివాస్, ఏటీవో సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంల చర్చల్లో మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విభ జన అంశాల పరిష్కారానికి సీఎం నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో చర్చలు జరిపారు. ఈ చర్చలకు రాష్ట్రం నుంచి ముగ్గురు మంత్రులకు ఆహ్వానం ఉండడం తెలిసిందే. నిడదవోలు ఎమ్మెల్యే, రాష్ట్ర పర్యాటక శాఖ కందుల దుర్గేష్ కూడా పాల్గొనడం గమనార్హం. చర్చలు సజావుగా సాగినట్టు ఆయన తెలిపారు.

ఆశలన్నీ పండుగలపైనే



- దిగజారిన కొబ్బరి ధరలు
- వరుస పర్వదినాలపైనే రైతుల ఆశలు
- క్షీణించిన ఎగుమతులు
- ఇతర రాష్ట్రాల్లో ఆశాజనకంగా దిగుబడులు
- ఊపందుకోని నీటికాయ అమ్మకాలు

అంబాజీపేట, జూలై 6: రాష్ట్రంలో కొబ్బరి నాణ్యమైన దిగుబడులు లేక, ఇతర రాష్ట్రాల్లో దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో కోనసీమ కొబ్బరి మార్కెట్‌లో ధరలు దిగజారాయి. ఈ ఏడాది జనవరి నుంచి ధరల పెరుగుదలలో పెద్దగా వ్యత్యాసం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం ఎకరా దింపు తీసిన ఖర్చులు కూడా రావడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఆర్డర్లు రాకపోవడంతో రోజుకు 20 లారీల సరుకు మాత్రమే ఎగుమతులు అవుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఆశాజనకంగా ఉండడంతో ఆయా రాష్ట్రాల నుంచి వివిధ రాష్ట్రాలకు కొబ్బరి అధికంగా ఎగుమతులు జరుగుతున్నాయి. అయితే త్వరలో వచ్చే నాగపంచమి, శ్రావణమాసం, రాఖీపౌర్ణమి, వినాయక చవితి పండుగలతో కొబ్బరి ధరలు పెరుగుతాయని రైతులు, వ్యాపారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో మహిళలు రాఖీకడితే కానుకగా కొబ్బరికాయలను అందిస్తారని, దీంతో ఆయా ప్రాంతాలకు భారీగా కొబ్బరికాయల ఎగుమతి అయ్యే అవకాశాలు ఉండవచ్చని కొబ్బరి అప్పన కాశీప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం మధ్యప్రదేశ్, ఒడిసా రాష్ట్రాలకు మాత్రమే కొబ్బరి ఎగుమతులు అవుతున్నాయన్నారు. మరోవైపు వర్షాకాలం ప్రారంభం ఆలస్యంకావడం ఈ కొబ్బరి ఎగుమతులకు ఆటంకం కలుగుతోందన్నారు. వర్షాకాలం ప్రారంభం అయితే ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ పనులను ప్రారంభించే ముందే కొబ్బరికాయలు కొడతారని, దీంతో ఆయా ప్రాంతాలకు ఎగుమతులు అధికంగా అవుతాయని ఆయన తెలిపారు. వ్యవసాయ పనులను ప్రారంభిస్తే బీహార్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, గుజరాత్ తదితర రాష్ట్రాలకు ఎగుమతులు జోరుగా సాగుతాయి. అలాగే పండుగలైన నాగపంచమి, శ్రావణమాసం, రాఖీపౌర్ణమి, వినాయకచవితికి కొబ్బరి ఎగుమతులు మరింతగా జోరందుకుంటాయని ఆయన చెప్పారు.

నీటికాయ ధరల మాటేమిటి..

కోనసీమ ప్రాంతంలో రైతులు అధికంగా కొబ్బరిపైనే ఆధారపడి జీవిస్తారన్నది తెలిసిందే. గతంలో రైతులు ఎప్పుడు దింపు తీసినా పచ్చికొబ్బరికాయలను లేదా నెలరోజులపాటు నిల్వ ఉంచిన ముక్కుడు కొబ్బరికాయలను విక్రయిస్తూ జీవనం సాగించేవారు. అయితే ప్రస్తుతం కొబ్బరి దిగుబడులు తగ్గినప్పటికీ ధరలు ఏ మాత్రం పెరగలేదు. నీటికాయ ధరలు క్వింటాలుకు రూ.9 వేలు మాత్రమే ధరలు అందుతున్నాయి. గత మూడేళ్ల నుంచి ఇవే ధరలు కొనసాగుతున్నాయి. ఇతర అన్ని సరుకుల ధరలు పెరుగుతున్నా కొబ్బరి ధరల్లో మాత్రమే మార్పు ఉండడంలేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కొబ్బరి మార్కెట్ ధరలు ఇలా...

కొబ్బరి రకం	ధర(రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	9,500
కురిడీ కొబ్బరి(పాతవి) :	
గండేరా(వెయ్యి)	13,500
గటగట(వెయ్యి)	11,000
కురిడీ కొబ్బరి (కొత్తవి) :	
గండేరా(వెయ్యి)	10,00
గటగట(వెయ్యి)	9,000
నీటికాయ :	
పాత(ముక్కుడు)(వెయ్యి)	9,000- 9,500
కొత్త(పచ్చి) (వెయ్యి)	8,000-8,500

రేపు అంబాజీపేటలో నాఫెడ్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

అంబాజీపేట, జూలై 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే నాఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని ఆయిల్‌ఫెడ్ ఎండీ చావెల బాబురావు ఆదేశాల మేరకు ఈనెల 8వ తేదీన అంబాజీపేటలో ప్రారంభిస్తున్నట్టు ఏపీ ఆయిల్‌ఫెడ్ సీనియర్ మేనేజర్ యు.సుధాకరరావు తెలిపారు. అంబాజీపేటలో సోమవారం రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా ఈ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. మిల్లింగ్‌కోప్రాకు క్వింటాల్‌కు రూ.11,160, బాల్‌కోప్రాకు రూ.12 వేలు మద్దతు ధర నిర్ణయించిందన్నారు. ఆర్బీకేలలో నమోదు చేసుకున్న రైతుల వద్ద నుంచి నోడల్ ఏజెన్సీ కృషీవల కోకోనట్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ గణపతి వీరరాఘవులు, సీఈవో అడ్డాల గోపాలకృష్ణ, ముత్యాల జమీలు ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తామన్నారు. కొబ్బరి తేమ శాతం, దుమ్ము, దూళి తదితర అంశాలను రైతులు పాటించాలన్నారు. మూడు నెలలపాటు కొబ్బరి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు కొబ్బరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



వర్శిటీ ప్రాంగణంలో వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

నన్నయ వర్శిటీలో అవినీతి

- ఐదేళ్లుగా రూ. 40 కోట్ల మేర నిధులు మింగేశారు
- రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

దివాన్‌చెరువు, జూలై 6 : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో 2019 -2024 మధ్య కాలంలో రూ.30-40 కోట్లు మేర అవినీతి జరిగిందని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆరోపించారు. నన్నయ ప్రాంగణంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. వర్శిటీలో అవినీతి అక్రమాలపై సీబీసీఐడీతో విచారణ జరిపిస్తామన్నారు. టెండర్ల నిబంధనలు తుంగలో తొక్కి వారి బంధువులు, బినామీలు, స్నేహితులు, అనుచరులకు టెండర్లు వచ్చేలా చేశారన్నారు. చెల్లింపులు వ్యవహారంలో కూడా ప్రభుత్వం వద్ద నిధులు లేవంటే వర్శిటీ నిధులను ఆయా శాఖలకు బదిలీచేసి చెల్లింపులు చేశారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక ఆనాడు అధికారంలో ఉన్న వారి బంధువులు, అనుచరులు 40 మందికి వర్శిటీలో ఉద్యోగ నియామకాలు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే తన సొంతమామను వీసీ మెంబరుగా ఆర్థిక కమిటీలో సభ్యుడిగా నియమించుకుని వర్శిటీ నిధులను అనేక రకాలుగా దోపిడీ చేశారన్నారు. విద్యాప్రమాణాలు పరిగణనలోకి తీసుకోకుండా దొంగ సర్టిఫికెట్లతో ఉద్యోగ నియామకాలు చేపట్టారని ఆరోపించారు.దీనిపై ప్రాథమికంగా ఇప్పటికే కొంత నివేదిక తయారు చేశామని ఇంకా వివరాలు సేకరిస్తున్నామన్నారు. వర్శిటీలో అవినీతిపై పూర్తిస్థాయి సమాచారం కోరేందుకు వచ్చినా రిజిస్ట్రార్ అందుబాటులో లేరన్నారు. దీంతో పూర్తిస్థాయి సమాచారం అందించాలని ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ పి.సురేష్ వర్మకు పత్రాలు అందజేశామన్నారు. వీసీ పదవికి రాజీనామా చేసిన పద్మరాజు రాజీనామా తర్వాత కూడా ఫైళ్ల మీద సంతకాలు చేస్తున్నట్టు తెలిసిందన్నారు. నన్నయ అక్రమాలపై సీఎం, ఉపముఖ్యమంత్రి, మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళతానన్నారు.

ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలి

జిల్లా కలెక్టర్‌ను కలిసిన టీడీపీ నేత జవహర్



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న కేఎస్ జవహర్

కొవ్వూరు, జూలై 6: జిల్లాలో ఇసుక పాలసీని పారదర్శకంగా అమలు చేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని ఆయన శనివారం రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎటువంటి చెడ్డపేరు రాకుండా ఇసుక పాలసీని అమలుపర్చాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా రాజమహేంద్రవరం జిల్లాలో ఇసుక ర్యాంపులు ఉన్నాయని, ఇసుకపాలసీని పారదర్శకంగా అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఆయన వెంట బూరుగుపల్లి రాఘవులు, వసలపూడి బోసు తదితరులున్నారు.

టీడీపీ రాష్ట్రాధ్యక్షుడిని కలిసిన దొరబాబు



పల్లా శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దొరబాబు

గోపాలపురం, జూలై 6: టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌ను చిట్యాల గ్రామానికి చెందిన రాష్ట్ర సాంస్కృతిక విభాగ అధికార ప్రతినిధి నూతంగి దొరబాబు, మండల మాజీ అధ్యక్షుడు గద్దే హరిబాబు శనివారం మంగళగిరి కేంద్ర కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం చరవాణిలో దొరబాబు మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గంలో పార్టీ గెలుపుకు తమవంతు కృషి చేసినట్టు శ్రీనివాసరావుకు తెలిపామన్నారు. వారి వెంట వేగి సుధాకర్ ఉన్నారు.

ప్రీస్కూల్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే

కొవ్వూరు, జూలై 6: మండలంలోని పెనకనమెట్ట, చిడిపి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. శనివారం సీడీపీవో డి.మమ్మీ ఆధ్వర్యంలో ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్య పూర్తిచేసి, ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించి, గ్రాడ్యుయేషన్ డే జరిపారు. అనంతరం గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించి స్టాప్ డయేరియా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణకు తీసుకోవలిసిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో పెనకనమెట్ట సర్పంచ్ మేకల శ్రీను, సూపర్‌వైజర్ కె.వెంకటపద్మిణి పాల్గొన్నారు.

విద్యార్థికి మానవత ఆర్థిక సాయం

తాళ్లపూడి, జూలై 6: మండలం ప్రక్కిలంక గ్రామంలో బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఐదో తరగతి విద్యార్థికి వైద్యం నిమిత్తం మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో రూ.11 వేల ఆర్థిక సాయం సహాయం అందించినట్టు సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్ తెలిపారు. కార్యక్రమంలో సనపల రాజశేఖర్, అప్పన హనుమంతరావు, తిగిరిపల్లి దోసయ్య, వి.చంద్రయ్య, సీహెచ్ ఆంజనేయులు, పెమ్మాడి దుర్గాప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సామగ్రి అందజేత



బాధితులకు ఇంటి సామగ్రి అందిస్తున్న దేవోక్తి సోషల్ సర్వీస్ సభ్యులు

తాళ్లపూడి, జూలై 6: మండలంలోని పైడిమెట్టలో అగ్ని ప్రమాదానికి గురైన దేవరపల్లి కిషోర్ కుటుంబానికి దేవోక్తి సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు, ఇంటి సామగ్రిని అందించారు. ప్రత్తిపాటి అబేద్నిగో మాట్లాడుతూ అగ్ని ప్రమాద విషయం తెలిసిన వెంటనే పలువురు దాతలకు తెలుపగా రూ.32,000 అందించారని వాటితో నిత్యావసరాలు, సామగ్రి సమకూర్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో బాలామణి, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, యాళ్ళ బాబూరావు, రాజు, సుధాకర్, భాను, పవన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



చాగల్లు, జూలై 6: ప్రధాని మోదీ పిలుపు మేరకు చాగల్లులో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం, వెటర్నరీ ఆసుపత్రి, ప్రభుత్వ ఆసుపత్రి తదితర ప్రదేశాల్లో వివిధ రకాల మొక్కలు నాటారు. ఆపై వాటిని పరిరక్షించుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మద్దిపాటి సురేష్, తాళ్లూరి వరప్రసాద్, గ్రంధి రాంబాబు పాల్గొన్నారు.

7 వేల కిలోల పీడీఎస్ బియ్యం పట్టివేత



అక్రమంగా నిల్వలు కలిగిన పీడీఎస్ బియ్యంతో అధికారులు

ఉండ్రాజవరం, జూలై 6: ఉండ్రాజవరంలో శనివారం ఏడు టన్నుల పీడీఎస్ బియ్యం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సబిహా ట్రేడర్స్ రైస్ మిల్లులో ఈ అక్రమ నిల్వలను గుర్తించి అధికారులు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పెరవలి, ఉండ్రాజవరం సీఎస్ టీడీ ఎస్.సుధీర్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఉండ్రాజవరంలో రైస్‌మిల్ అబ్దుల్ గఫర్ అలియాస్ బాషాతో నడుపబడుతున్న సబిహా ట్రేడర్ రైస్ మిల్‌లో రూ.3.70లక్షలు విలువ చేసే పీడీఎస్ బియ్యం ఉన్నట్టు గుర్తించామన్నారు. పౌర సరఫరాల శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించామని, బియ్యం స్వాధీనం చేసుకుని యజమానిపై చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో రాజమండ్రి, నిడదవోలు, రాజానగరం సీఎస్‌డీటీలు ప్రభాకర్, అనిల్, జి.బాపిరాజుతోపాటు స్థానిక వీఆర్వోలు వి.పాపారావు, ఆర్.లక్ష్మి, బి.శ్రీనివాస్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్య భద్రతకు పెద్దపీట

రాజమహేంద్రవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఖైదీల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తున్నామని సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ పేర్కొన్నారు. యోగానంద నేత్రాలయ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జైలులోని సేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జైళ్ల శాఖ కల్పిస్తున్న శిక్షణను ఉపయోగించుకొని మానసిక పరివర్తన చెంది విడుదలైన తర్వాత సమాజానికి, కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ట్రస్టుకు రూ.25 వేలు అందజేసిన ఆమెన్ ట్రస్టు ప్రతినిధులను అభినందించారు. నేత్ర పరీక్షల అనంతరం మందులను అందజేశారు.

జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలి

» రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు జయరాజు

» మాజీ ఉప ప్రధాని వర్ధంతి.. పలువురి నివాళి



కొవ్వూరులో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

కొవ్వూరు, జూలై 6: మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ఇచ్చి గౌరవించాలని బాబు జగ్జీవన్‌రామ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పెనుమాక జయరాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగ్జీవన్‌రామ్ 38వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం కొవ్వూరు మెరకవీధి, మెయిన్‌రోడ్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జయరాజు మాట్లాడుతూ అర్ధ శతాబ్ధికి పైగా మంత్రిగా, దేశ ఉప ప్రధానిగా దేశానికి సేవలు అందించడంతో పాటు, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ అహర్నిసలు కృషి చేశారన్నారు. ఏ పదవి చేపట్టిన ఆ పదవికే వన్నె తీసుకువచ్చారన్నారు. గొప్ప పార్లమెంటేరియన్‌గా ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడన్నారు. కార్యక్రమంలో గెల్లా గణేష్, చాపల చంద్రరావు, జి. జీవరత్నం, ముప్పిడి శ్రీను, ఎస్.బ్రహ్మయ్య, అనపర్తి గోపాలకృష్ణ, పాకా జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని పైడిమెట్టలో జగ్జీవన్‌రామ్ సమాఖ్య ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలతో నిర్వహించారు. అనంతరం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ కేంద్రంలో ఎన్నో మంత్రిత్వ శాఖలను సమర్ధవంతంగా నిర్వహించారని, దళితుల అభ్యున్నతికి ఎనలేని సేవలందించారన్నారు. కార్యక్రమంలో కొప్పాక కోటేశ్వర్, జగ్జీవన్‌రామ్ సమాఖ్య అధ్యక్షులు దేవరపల్లి రమేష్, కొల్లి దుర్గారావు, కిప్పాక పోసియ్య, జొన్నకూటి కిషోర్ పాల్గొన్నారు. తాళ్లపూడిలో పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి ఆశాఅలేఖ్య ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. శ్రీవిజేత పాఠశాలలో హెచ్ఎం జొన్నకూటి ప్రమోద్‌కుమార్, పెద్దేవంలో ఎమ్మార్పీఎస్ యూత్, మలకపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకుడు గెడ్డం వినోద్, సర్పంచ్ రాపాక రాజేశ్వరి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు. అన్నదేవరపేటలోని అరుంధతీపేటలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ సీనియర్ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య విచ్చేసి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముళ్లపూడి రామచంద్రం, కొడమంచిలి జాన్‌బాబు, కూచిపూడి అచ్చిబాబు, తొండెపు భరత్, పల్లి ప్రకాష్ పాల్గొన్నారు.



తాళ్లపూడి: పైడిమెట్టలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. మోదుగా సుబ్బారావు, జాలాది వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ భారత ఉప ప్రధానిగా, జాతి నాయకుడిగా దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జాలాది రవికుమార్, యర్రా జగదీష్, మండూరి చిన్నియ్య, కొక్కిరపాటి వెంకటేశ్వరరావు, మోదుగ నాగేశ్వరరావు, జలాది చిన్ని పాల్గొన్నారు.



నల్లజర్ల: చీపురుగూడెంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

నిడదవోలు: మండలంలోని సమిశ్రగూడెంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కుల నిర్మూలన పోరాట సమితి ఉమ్మడి గోదావరి జిల్లాల ప్రధాన కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగజీవన్‌రామ్ భారతదేశ ఉప ప్రధానిగా రైల్వే, ఎల్ఐసి, పోస్టల్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, కార్మిక శాఖ, డిఫెన్స్, కేంద్ర మంత్రిగా 50 ఏళ్ల పాటు దేశానికి సుదీర్ఘ సేవలందించారన్నారు. ఆయన హయాంలోనే ధాన్యం నిల్వల కోసం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేశారన్నారు. జగజీవన్‌రామ్‌కు భారతరత్న ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దిద్దే రాజు, ముప్పిడి జగజీవన్‌రామ్, సిర్రా గోపి, గెడ్డం మహీంద్ర, వరుణ్ పాల్గొన్నారు.



నిడదవోలు:సమిశ్రగూడెంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

గోపాలపురం: మండలంలోని ఉప్పరగూడెంలోని కూనపం ప్రసాద్‌బాబు, పెద్దగూడెంలో కొడవటి చినవెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు టీడీపీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది గోపాలపురం జడ్పీ హైస్కూల్లో 10వ తరగతిలో 538 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన మల్లిపూడి తేజశ్వినికి తానేటి చిట్టి జ్ఞాపకార్థం వారి కుమారుడు తానేటి రామ్‌పండు ఆర్థిక సాయంతో సమకూర్చిన నగదును అందించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ భారతదేశ ఉపప్రధానిగా జగ్జీవన్‌రామ్ అణగారిన వర్గాల అభివృద్ధితో పాటు పలు శాఖలను సమర్థవంతంగా నిర్వహించి తాను నిర్వహించిన పదవులకు వన్నె తెచ్చారన్నారు. దేశ వ్యాప్తంగా ఓటమెరుగని నాయకుడిగా ముద్ర వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో శ్రీధర్, తానేటి వీర్రాఘవులు, కొడవటి గంగరాజు, రాపాక ఫణికిషోర్, పడమటి శ్రీను, సూతాపల్లి రామకృష్ణ, చోళ్ళ నాని, బాలిన రాము, దాసరి రవి పాల్గొన్నారు.



గోపాలపురం:పెద్దగూడెంలో విద్యార్థినికి ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

పెంపుడు జంతువులకు యాంటీ ర్యాబిస్ టీకాలు వేయించాలి

» టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు రామకృష్ణారావు



కొవ్వూరులో పెంపుడు కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ ఏడీ వెంకటరెడ్డి

కొవ్వూరు, జూలై 6: పెంపుడు జంతువులకు తప్పనిసరిగా ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంతమణి రామకృష్ణారావు అన్నారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా కొవ్వూరు పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు ఉచితంగా యాంటీ ర్యాబిస్ టీకాలు వేశారు. పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు ఎ.వెంకటరెడ్డి మాట్లాడుతూ పశువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులను జూనోటిక్ వ్యాధులంటారు. 1885 జూలై 6న శాస్త్రవేత్త లూయిపాశ్చర్ ర్యాబిస్ వ్యాధి సోకిన బాలుడికి వ్యాధి నిరోధక టీకా ఇచ్చి ప్రాణాపాయం నుంచి రక్షించారన్నారు. అప్పటినుంచి ఏటా జూలై 6న వరల్డ్ జూనోసిస్ డే జరుపుకుంటున్నామన్నారు. కొవ్వూరు లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో పెంపుడు జంతువులకు ర్యాబిస్ టీకాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, నాళం శ్రీనివాస్, పాలింపాటి చిన్నబాబు, ఉప్పులూరి రామకృష్ణ, పెనుమాక జయరాజు, డాక్టర్ కేఎస్‌వీ చంద్రమౌళి, ఎస్‌వీఎన్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని పశువుల ఆసుపత్రి ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత ర్యాబీస్ వ్యాధి నిరోధక టీకాల శిబిరం నిర్వహించి సుమారు 200 కుక్కలకు టీకాలు వేశారు. శిబిరం ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ సంస్థను పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.రాధాకృష్ణ అభినందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జేష్ట వెంకటేశ్వరరావు, కార్యదర్శి బేతిన వి.రామన్, కోశాధికారి బండి రామ్‌గోపాల్, బండి వెంకటేశ్వరరావు, గారపాటి ప్రసాద్ తదితర్లు పాల్గొన్నారు.



నిడదవోలులో కుక్కకు వ్యాక్సిన్ వేయిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం: మండలంలోని దమ్మెన్ను గ్రామంలో ఉచిత వ్యాక్సిన్ కార్యక్రమం జరిపారు. పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.సత్యనారాయణ, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు. మోర్త, ఉండ్రాజవరం గ్రామాల్లో వ్యాక్సినేషన్ నిర్వహించారు.

చాగల్లు: చాగల్లులో ప్రభుత్వ పశువైద్యశాల వద్ద నెలటూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షుడు ఏవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. 82 పెంపుడు కుక్కలకు టీకాలు వేసి, టీ వార్మింగ్, యాంటీ ఎలర్జీ మందులు ఉచితంగా అందజేశారు. వెటర్నరీ ఉప సంచాలకుడు జి.రాధాకృష్ణ మాట్లాడుతూ జంతువులు వల్ల సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన ఉండాలన్నారు. ఆవులకు వచ్చే లంపీ చర్మవ్యాధి నివారణ టీకాలు, గొంతు వాపు వ్యాధి టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు యు.ముఖేష్, బిగిరీషా, ఎంఎం రాజేష్, లయన్స్‌క్లబ్ సభ్యులు వల్లేపల్లి వెంకట రామారావు, వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చాగల్లులో యాంటీ ర్యాబిస్ వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

తీపర్రులో దొంగలు పడ్డారు

» ఆలయాల్లో వరుస దొంగతనాలు

» నాలుగైదు రోజుల క్రితం మోటార్‌సైకిల్ చోరీ

» పోలీసులు రాత్రి గస్తీ పెంచాలంటున్న గ్రామస్థులు

పెరవలి, జూలై 6: ఇటీవల కాలంలో తీపర్రులో చిల్లర దొంగలు రెచ్చిపోతున్నారు. నిడదవోలు-నరసాపురం రహదారిపై ఈ గ్రామం వద్ద ఉన్న వినాయకుడు, సాయిబాబా ఆలయాల్లోని రెండు మూడు తేడాతో హుండీలను దొంగలు ఎత్తుకుపోయారు. గ్రామ ప్రధాన రహదారికి ఎదురుగా ఉండే వినాయకుని ఆలయంలో పది రోజులు క్రితం డిబ్బిలను దొంగలు ఎత్తుపోయారు. అనంతరం వారం రోజులు క్రితం ఆ పక్కనే సాయిబాబా ఆలయంలోని డిబ్బిని కూడా పట్టుకుపోయి సమీపంలోని పశువులు పాకలో పగులగొట్టి చిల్లర ఎత్తుకుపోయారు. పోలీసు స్టేషన్ల చుట్టు తిరగడం ఎందుకనో తెలియదు గాని ఈ సంఘటనలపై పోలీసులకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. అయితే నాలుగైదు రోజులు క్రితం మళ్లీ దొంగలు గ్రామంలో ప్రవేశించి ఒక వీధిలో రోడ్డుపై ఉంచిన మోటారుసైకిల్ దొంగతనానికి పాల్పడ్డారు. ఈ చోరీ చేయడానికి వచ్చిన వారు ఒక ఆటోపై వచ్చి నిడదవోలు-నరసాపురం రోడ్డుపై నిలిపి ఉంచారు. అర్ధరాత్రి సమయంలో అలికిడి విన్న రోడ్డుపై ఒక గ్రామస్థుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చే లోపు దొంగలు ఆటోను అక్కడే వదిలి వేసి ఒక మోటారుసైకిల్‌పై పరారయ్యారు. పోలీసులు ఆ ఆటోను స్వాధీనం చేసుకోగా అందులో వేరే చోట దొంగిలించుకుని తీసుకొచ్చిన ఆలయాల్లోని హుండీలను గుర్తించారు. దీంతో ఆటోను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ తరహా దొంగతనాలు ఇటీవల కాలంలో ఎప్పుడూ జరగలేదని, రాత్రి సమయాల్లో పోలీసు గస్తి పెంచాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వినాయకుడి ఆలయం వద్ద మాయమైన హుండీ



దొంగలు వదిలి వెళ్లిన ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్న దృశ్యం

ఒకటో ప్లాట్‌ఫాంకు రైళ్ల నిలిపివేత

నెలపాటు మరమ్మతులు

రాజమహేంద్రవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో ట్రాక్ మరమ్మతుల నిమిత్తం ఒకటో ప్లాట్‌ఫాంకి రైళ్ల రాకపోకలను నిలిపివేయనున్నారు. మే నెల 5న గూడ్సు రైలు రెండో ప్లాట్‌ఫాం ట్రాక్‌పై పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. దీంతో ఒకటి, రెండు ట్రాక్‌లకు పూర్తిగా మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. అదే నెల 16న రెండో ట్రాక్ మరమ్మతులను ప్రారంభించి గత నెల 18న పూర్తి చేశారు. ప్లాట్‌ఫాంపై టైల్సు వేసే పనులు ఆలస్యం కావడంతో మరి కొద్ది రోజులు సమయం పట్టింది. ప్రస్తుతం ఆ ట్రాక్‌పై ప్రయాణికుల, గూడ్సు రైళ్లు యథావిధిగా నడుస్తున్నాయి. దీంతో ఒకటో ప్లాట్‌ఫాం ట్రాక్ పట్టాలను పూర్తిగా మార్చే పనిని చేయనున్నారు. దీని కోసం సోమవారం(9వ తేదీ) నుంచి సుమారు నెల రోజులపాటు ఈ ప్లాట్‌ఫాంకి రైళ్ల రాకపోకలు నిలిపివేసే అవకాశం ఉంది. అధికశాతం రైళ్లను రెండు, మూడు ప్లాట్‌ఫాంలపై నిలపనున్నారు. అవసరాన్ని బట్టి మూడు, నాలుగు ప్లాట్‌ఫాంలు కూడా వినియోగించనున్నారు. ఈ రెండు ప్లాట్‌ఫాంలపై ఇంకా షెడ్లు, బోగీల సంఖ్యలు తెలిపే సైన్ బోర్డులు లేకపోవడం గమనార్హం. వర్షాకాలం కావడంతో ఈ ట్రాక్‌లపై రైళ్లు నిలిపితే ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు ఖండన

రాజమహేంద్రవరం సిటీ, జూలై 6: తమిళనాడు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను హత్యచేయడాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం సాయంత్రం ఆరుగురు దుండగులు బైక్‌లపై వచ్చి అయన్ను అతికిరాతకంగా హత్య చేశారన్నారు. పార్టీని తమిళనాడులో బలోపేతం చేస్తున్న ఆర్మ్‌స్ట్రాంగ్‌ను హత్య చేసిన సంఘటనపై ఆ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

ఇన్‌చార్జి జిల్లా జడ్జి శివకుమార్

రాజమహేంద్రవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఇంచార్జి జిల్లా జడ్జి, 1వ అదనపు జిల్లా జడ్జి ఆర్.శివకుమార్ పేర్కొన్నారు. రవాణా, ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో న్యాయమూర్తులు, కోర్టు సిబ్బందికి రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం, నిర్లక్ష్యంగా నడపడం ప్రమాదకరమన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వల్ల ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. హెల్మెట్, సీట్ బెల్టు లేకుండా వాహనం నడపడం నేరమని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు, ఎంవీఐ జి.రామ్ నారాయణ్, ఏఎంవీఐ ఎస్.సబిత తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

SCHEDULE: Registered partition deed dated 12-06-2024,document No. 13218/2024Andhra Pradesh state, West Godavari district, Bhimavaram Registrartion district, Tadepalligudem Registration Sub District, Tadepalligudem mandal, Tadepalligudem municipality,1 ward, Tadepalligudem to Kondru prolu main road, near NIT college, as per revenue records R.S. No. 337 sub division R.S.No.337/1, Ac.1.27.5 and other agricultural land was converted for non agricultural purpose, later divided into plots in that northern side plot No.'s 37,38,39,40,41,42 is bounded by:

Item No. 1: plot No.37 site an extent of 158.33 sq.yds is bounded by: **East:** Plot No.36 site 47.6 feet South: Plot No.25 site 30 feet **West:** Plot No.38 site 47.6 feet **North:** 30 feet width road 30 feet With in the above boundaries site an extent of 158.33 sq.yds with all easement rights there on.

Item No.2: Plot No.38 site an extent of 158.33 sq.yds is bounded by: **East:** Plot No.37 site 47.6 feet **South:** Plot No.24 site 30 feet **West:** Plot No.39 site 47.6 feet **North:** 30 feet width road 30 feet With in the above boundaries site an extent of **158.33 sq.yds** with all easement rights there on.

Item No.3: Plot No.39 site an extent of 158.33 sq.yds is bounded by: **East:** Plot No 38 site 47.6 feet **South:** Plot No.23 site 30 feet **West:** Plot No.40 site 47.6 feet **North:** 30 feet width road 30 feet With in the above boundaries site an extent of **158.33 sq.yds** with all easement rights there on.

Item No.4: Plot No.40 site an ext ent of 158.33 sq.yds is bounded by: **East:** Plot No.39 site 47.6 feet **South:** Plot No.22 site 30 feet **West:** Plot No.41 site 47.6 feet **North:** 30 feet width road 30 feet With in the above boundaries site an extent of **158.33 sq.yds** with all easement rights there on.

Item No.5: Plot No.41 site an extent of 158.33 sq.yds is bounded by: **East:** Plot No.40 site 47.6 feet **South:** Plot No.21 site 30 feet **West:** Plot No.42 site 47.6 feet **North:** 30 feet width road 30 feet With in the above boundaries site an extent of **158.33 sq.yds** with all easement rights there on.

Item No.6: Plot No.42 site an extent of 158.33 sq.yds is bounded by: **East:** Plot No.41 site 47.6 feet **South:** Plot No.20 site 30 feet **West:** Plot No.43 site 47.6 feet **North:** 30 feet width road 30 feet With in the above boundaries site an extent of 158.33 sq.yds, item No.1 to 6 site an extent of 949.98 sq.yds with all easement rights there on.

06.07.2024

సారా తయారీ కేంద్రంపై దాడి

గోపాలపురం, జూలై 6: సారా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం మోపుతానని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని రాంపాలెం గ్రామ శివారులో సారా తయారీ కేంద్రంపై శనివారం ఉదయం దాడి చేసినట్టు చెప్పారు. ఈ దాడిలో 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 300 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామన్నారు. ఒకరిని వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 6: రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శనివారం రాత్రి రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డు కోటగుమ్మం నుంచి ఛాంబర్ ఆఫ్ కామర్స్ వరకు ట్రాఫిక్ తీరును కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసు అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. షాపులకు వచ్చే కస్టమర్ల వాహనాలు, షాపుల్లో పనిచేసే సిబ్బంది వాహనాలు నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే ఉంచాలన్నారు. షాపుల ఎదుట పార్కింగ్ చేయరాదన్నారు. ఈ మేరకు అధికారులు ముందుగానే వారికి తెలియజేసేవిధంగా గోడ పత్రికలు అంటించాలన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి

» నిడదవోలు బీసీ బాలికల హాస్టల్లో అవగాహన శిబిరం



నిడదవోలులో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కలిగిస్తున్న డాక్టర్ తేజశ్రీ

నిడదవోలు, జూలై 6: విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని డాక్టర్ తేజశ్రీ అన్నారు. శనివారం నిడదవోలులోని బీసీ బాలికల వసతి గృహంలో నిర్వహించిన అవగాహన శిబిరంలో ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు దరిచేరకుండా కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సత్యవతి, ఏఎన్ఎమ్ సుబ్బలక్ష్మి, హాస్టల్ వార్డెన్ రజని పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగించాలి

దేవరపల్లి, జూలై 6: గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అందరికి అవగాహన కల్పించాలని గ్రామ సచివాలయ ఉద్యోగులకు, సిబ్బందికి ఈవో ఎస్.రవికిషోర్ సూచించారు. దేవరపల్లిలో ఎక్కడపడితే అక్కడ చెత్తవేయకుండా గ్రామస్థులకు, షాపుల యజమానులకు డస్ట్‌బిన్‌లు అందించాలని, పంచాయతీ కార్మికులు ట్రాక్టర్లు, వ్యాన్లు కానీ, రిక్షాలు కానీ ఉదయం 9 గంటలకు వస్తున్నాయని వాటిల్లో వేయాలన్నారు. మాంసం దుకాణాలు, హోటళ్లు, జూస్‌ల షాపుల వద్ద పరిశుభ్రత పాటించే విధంగా చర్యలు చేపట్టాలని ఈవో చెప్పారు.



దేవరపల్లిలో సమీక్షలో మాట్లాడుతున్న ఈవో రవికిషోర్